
ఆంధ్రజ్యోతి

****

ANDHRAJYOTHY



నల్లగొండ

5

మంగళవారం 15 ఏప్రిల్ 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.138	225	245
సూర్యాపేట	రూ.150	210	240
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.0 । కనిష్ఠం 24.4

ఏటీసీలతో ఉపాధికి భరోసా!

టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్)తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీ) రానున్న విద్యాసంవత్సరం నుంచే అందుబాటులోకి రానున్నాయి. విద్యార్థులకు తక్షణ ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడం లక్ష్యంగా చేపట్టిన ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వ ఐటీఐ (ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్)లలో ఈ ఏటీసీలను ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నల్లగొండ (బాయ్స్), నల్లగొండ (గర్ల్స్) ఐటీఐలతో పాటు,అనుముల,డిండి, హుజూర్‌నగర్, ఆలేరు, భువనగిరిలోని ఐటీఐలలో వీటిని నిర్మిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

ఉమ్మడి జిల్లాలో ఏటీసీలకు సంబంధించి ఇప్పటికే భవనాల నిర్మాణాలు దాదాపు పూర్తికాగా, ల్యాబ్‌లు, కంప్యూటర్లు, వర్క్‌షాపులు, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ, ఇతర సామగ్రి, బోధనోపకరణాలు, ఇతర పనులు వేగవంతంగా సాగుతున్నాయి. నల్లగొండలోని బాయ్స్ ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన ఏటీసీని ఈ నెలలో ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా 65 ఏటీసీలను నెలకొల్పుతుండగా, మే నెలాఖరు నాటికి అన్ని ఏటీసీలు సిద్ధమవుతాయని, వచ్చే విద్యాసంవత్సరం నుంచి వీటిలో అడ్మిషన్లు ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు. ప్రతి ఏటీసీలో ఆరు ఆధునిక కోర్సులను ప్రవేశపెడుతున్నారు. ఈ కోర్సుల్లో శిక్షణ పూర్తయ్యాక టీటీఎల్ సహా అరబ్ దేశాలు, దేశీయ ఐటీ,సాఫ్ట్‌వేర్,హార్డ్‌వేర్ కంపెనీల్లో తక్షణం ఉద్యోగ అవకాశాలు కల్పించే..

- మిగతా 6వ పేజీలో...



నల్లగొండలోనిర్మాణం పూర్తయిన ఏటీసీ

- ఉమ్మడి జిల్లాలో ఏడు ఐటీఐలలో ఏర్పాటు
- పదేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు తీసుకున్న టాటా టెక్నాలజీ లిమిటెడ్
- ఇంటర్‌స్థాయిలోనే విద్యార్థులకు తక్షణ ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఛాన్స్
- ఏటీసీలలో ఆరురకాల ఆధునిక కోర్సులు

ఉమ్మడి జిల్లాలోని ఏటీసీలలో ప్రవేశపెట్టే కోర్సులు ఇలా..

కోర్సు	కాలవ్యవధి	ఒక్కో కేంద్రంలో సీట్ల సంఖ్య
అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్	రెండేళ్లు	24
ఆర్టిఫీషియన్ యూసింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్	ఏడాది	10
బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్(మెకానికల్)	రెండేళ్లు	24
ఇండస్ట్రియల్ రోబోటిక్స్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్	ఏడాది	20
ఎలక్ట్రికల్ వెహికిల్ మెకానిక్	రెండేళ్లు	24
మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్	ఏడాది	20

ఏటీసీల నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయి..



ఉమ్మడి జిల్లాలో ఏడు ప్రభుత్వ ఐటీఐల వద్ద నిర్మిస్తున్న ఏటీసీ భవనాల పనులు దాదాపు పూర్తయ్యాయి. వాటిల్లో ఏర్పాటు చేయాల్సిన సామగ్రి కూడా ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది. నల్లగొండలో బాయ్స్ కళాశాల వద్ద ఏర్పాటు చేస్తున్న ఏటీసీ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. మిగిలిన ఆరు ఏటీసీలలో కూడా నిర్మాణాలు దాదాపు చివరిదశకు వచ్చాయి. అన్నింటిలోనూ 2005-26 విద్యాసంవత్సరం నుంచి తరగతులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇక్కడ నిర్వహించే కోర్సులు ఆధునిక ప్రపంచంలో తక్షణం ఉపాధి, ఉద్యోగం పొందేందుకు విద్యార్థులకు ఉపయోగపడుతుంది. ఇంటర్ స్థాయిలోనే విద్యార్థులు ఉద్యోగం, ఉపాధి పొందేందుకు ఇవి దోహదపడతాయి.

- నరసింహచారి, ఉమ్మడి జిల్లా ఐటీసీల కన్వీనర్

వైభవంగా గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణను ప్రారంభిస్తున్న ఈవో భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట ఆలయంలో సోమవారం గిరిప్రదక్షిణ వైభవంగా సాగింది. కొండకింద వైకుంఠ ద్వారం చెంత గిరిప్రదక్షిణను ప్రారంభించారు. కాగా, వరుస సెలవులు కావడంతో సుమారు 20వేల మంది భక్తులు సామూహిక గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ●7లో..

నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో యూడైస్ సర్వే

ఏకీకృత జిల్లా పాఠశాలల విద్యా సమాచారం (యూడైస్)లో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నమోదు చేసిన వివరాలపై నేటి నుంచి థర్డ్ పార్టీ సర్వే ప్రారంభం కానుంది. ఇప్పటి వరకు విద్యా సంవత్సరంలో యూడైస్ నమోదు పూర్తయ్యాక కేవలం 5శాతం పాఠశాలల్లో క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ (సీఆర్‌పీ) మాత్రమే తనిఖీలు చేసేవారు. కానీ యూడైస్‌లో నమోదు చేస్తున్న విద్యార్థుల సంఖ్య, పాఠశాలలో వసతుల వివరాలపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో వాస్తవాలపై ప్రభుత్వం దృష్టిని సారించింది. దీంతో ఈనెల 15నుంచి 21వ తేదీ వరకు పాఠశాలల వారీగా డీఈడీ, బీఈడీ విద్యార్థులు యూడైస్ వివరాల ఆధారంగా సర్వే నిర్వహించనున్నారు. ఈ మేరకు సర్వేలో పాల్గొనే విద్యార్థులకు అవగాహన, శిక్షణ తరగతులు ఇప్పటికే పూర్తయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని సుమారు 2,800 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ సర్వే సాగనుంది. అయితే విద్యాశాఖలో థర్డ్ పార్టీ సర్వే ఇదే ప్రథమం కావడం గమనార్హం.

- (ఆంధ్రజ్యోతి,భువనగిరి టౌన్)



యూడైస్ నమోదు వివరాల ఆధారంగానే పాఠశాలలకు ప్రభుత్వం గ్రాంట్స్ మంజూరు చేస్తుంది. వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తుంది. దీంతో పాఠశాల విద్యలో యూడైస్ అత్యంత కీలకం. పాఠశాల వివరాలతో పాటు విద్యార్థి సమగ్ర వివరాలు కూడా యూడైస్‌లో నమోదు చేస్తారు. ఈ మేరకు 2024-25 విద్యాసంవత్సరంలో నమోదైన వివరాలపై థర్డ్ పార్టీ సర్వే జరగనుంది. ఆయా పాఠశాలల్లో తరగతుల వారీగా చదువుతున్న విద్యార్థులు, ఆధార్ అనుసంధానం, తరగతి గదులు, మూత్రశాలలు, తాగు నీరు, పాఠశాల భవనం, క్రీడా స్థలం, ఫర్నిచర్, ల్యాబ్, విద్యార్థుల యూనిఫాం, పాఠ్యపుస్తకాల సరఫరా, ప్రస్తుత విద్యాసంవత్సరంలో నూతన ప్రవేశాలు, డ్రాపౌట్స్, మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయులు, ఖాళీలు తదితర సమగ్ర వివరాలను యూడైస్‌తో సరిపోల్చుతారు. పాఠశాల, తరగతుల వారీగా కావాల్సిన సదుపాయాలు, అవసరాలను గుర్తించనున్నారు. అలాగే యూడైస్‌లో నమోదు చేసిన వివరాల తప్పొప్పులను సర్వే సభ్యులు ధ్రువీకరించనున్నారు.దీంతో విద్యాశాఖలో ఈథర్డ్‌పార్టీ సర్వే అత్యంత కీలకమైనదని అధికారులు పేర్కొంటున్నారు.

- థర్డ్ పార్టీ ద్వారా నిర్వహణ
- విద్యార్థుల సంఖ్యపై తేలనున్న వాస్తవాలు
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 2,800 పాఠశాలలు
- 250 మంది డీఈడీ, బీఈడీ విద్యార్థుల ద్వారా సర్వే

ఒక్కొక్కరు పది పాఠశాలలు...

థర్డ్ పార్టీ సర్వే బాధ్యతను విద్యాశాఖ డీఈడీ, బీఈడీ విద్యార్థులకు అప్పగించింది. ప్రభుత్వ...

- మిగతా 6వ పేజీలో...

ఏర్పాట్లు పూర్తి చేశాం



యూడైస్ థర్డ్ పార్టీ సర్వే కోసం ఏర్పాట్లు పూర్తి చేశాం. సర్వే బృందాలకు పాఠశాలలను కేటాయించాం. అయితే యూడైస్‌లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నమోదు చేసిన వివరాలు సమగ్రంగానే ఉంటాయని భావిస్తున్నాం. థర్డ్ పార్టీ సర్వేతో పాఠశాలలకు ప్రయోజనం చేకూరనుంది.

- కె.సత్యనారాయణ, యాదాద్రి డీఈవో

జానారెడ్డిపై అసత్యప్రచారం

- ఆయన లేఖతో రాజగోపాల్‌రెడ్డికి మంత్రిపదవి రాలేదనడం సరికాదు
- ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్



నల్లగొండ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): మాజీ మంత్రి జానారెడ్డి ఏఐసీసీకి రాసిన లేఖ వల్లే ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి మంత్రిపదవి రాకుండా ఆగిందనడం అసత్య ప్రచారమని, మంత్రి పదవి ఇవ్వవద్దని జానారెడ్డి ఎక్కడా, ఎవరికీ చెప్పలేదని, ఏ లేఖలోనూ రాయలేదని ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు కేతావత్‌శంకర్‌నాయక్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన నల్లగొండలో మీడియాతో మాట్లాడారు. జానారెడ్డి ఎవరి పదవులకూ అడ్డుపడేవ్యక్తి కాదని, రాజగోపాల్‌రెడ్డికి అధిష్ఠానం మంత్రిగా అవకాశం కల్పిస్తే సంతోషపడే వ్యక్తి అన్నారు. అధిష్ఠానం రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే జానారెడ్డిగానీ, పీసీసీ అధ్యక్షుడుగానీ, తాను గానీ ఎవరూ అడ్డుచెప్పరన్నారు. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం లేనందున, అక్కడి ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీమంత్రులు జానారెడ్డివద్దకు వచ్చి గ్రేటర్ హైద్రాబాద్ పరిధిలో మంత్రి పదవి అవసరమని,రానున్న గ్రేటర్ ఎన్నికలు, అభివృద్ధి కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని అధిష్ఠానానికి తెలియజేయాలని కోరారన్నారు. ఆ రెండు జిల్లాలకు క్యాబినెట్‌లో అవకాశం కల్పించాలని కోరుతూ జానారెడ్డి లేఖ రాశారని వివరించారు. ధర్మరాజులా పార్టీకి జానారెడ్డి మార్గనిర్దేశం చేస్తున్నారని తెలిపారు. రాజగోపాల్‌రెడ్డికి మంత్రిపదవి ఇస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చిన విషయంపై స్పందిస్తూ, ఆ అంశం రాజగోపాల్‌రెడ్డికి, అధిష్ఠానానికి మాత్రమే సంబంధమని, తన పరిధికి మించిన అంశమని, తాను వ్యాఖ్యానించలేనని తెలిపారు. అధిష్ఠానం మాట ఇస్తే తప్పకుండా నెరవేరుస్తుందని స్పష్టం చేశారు.

అంబేడ్కర్ రాజ్యాంగంతోనే సమాన హక్కులు

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్లే సమాజంలో ప్రతీ ఒక్కరు హక్కులు, బాధ్యతలు, పదవులను పొందగలుగుతున్నారని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా మర్రిగూడ బైపాస్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డీఈవో కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంబేడ్కర్ రాజ్యాంగంలో రూపొందించిన ఆర్టికల్స్ వల్లే తాను ఐఏఎస్ కాగలిగానని, భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్ కావాలనుకునే విద్యార్థులకు ఆయన రాజ్యాంగమే స్ఫూర్తి అని అన్నారు. సమాన విద్య, సమానత్వ హక్కులు,ప్రాథమిక హక్కులన్నీ రాజ్యాంగం ద్వారా సంక్రమించాయన్నారు. అంబేడ్కర్ జయంతి రోజున రాష్ట్ర ప్రభుత్వం భూభారతి పోర్టల్‌ను అమలులోకి తెచ్చిందన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ చదువును ఆయుధంగా తీసుకొని సామాజిక మార్పును తీసుకొచ్చిన మహానుభావుడు డాక్టర్ అంబేడ్కర్ అని కొనియాడారు. ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, నెల్లికంటి సత్యం మాట్లాడుతూ, అణగారిన వర్గాల కోసం హక్కులు, చట్టాలను రూపొందించిన మహనీయుడు అంబేడ్కర్ అని అన్నారు. ఆయన స్ఫూర్తిగా సమానత్వం కోసం ప్రజాతంత్ర శక్తులంతా కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, అదనపు ఎస్పీ రమేష్, సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్, జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్‌రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, బీసీ సంఘం, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్సీలు భారత రాజ్యాంగ పుస్తకాన్ని ఆవిష్కరించారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

● కలెక్టర్లతో సీఎం సమీక్ష



హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో కలెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చలేక ప్రభుత్వం అభాసుపాలు

మాజీమంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

సూర్యాపేట(కలెక్టరేట్), హుజూర్‌నగర్, ఏప్రిల్ 14,(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక కాంగ్రెస్ ప్రభుత్వం అభాసుపాలైందని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు.వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం కోసం సోమవారం జిల్లాకేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు బంధు, రైతు బీమా, రైతు భరోసా ఇవ్వకపోగా, రుణమాఫీ పూర్తిగా చేయలేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ఆసరా పింఛన్లు పెంచకపోగా ఉన్న పింఛన్లు సమయానికి ఇవ్వడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకుల మాయ మాటలకు మోసపోయిన ప్రజలు నేడు గోసపడుతున్నారన్నారు. ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే సభ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఆత్మకూర్(ఎస్) మండలం మంగళి తండాతో పాటు పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, రాష్ట్ర నాయకులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, వై.వెంకటేశ్వర్లు, నాయకులు గోపగాని వెంకటనారాయణగౌడ్, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, పెరుమాళ్ల అన్నపూర్ణ, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, పుట్టా కిశోర్‌కుమార్, మొరిశెట్టి శ్రీనివాసులు, సవరాల సత్యనారాయణ, బూర బాలసైదులుగౌడ్, కొణతం సత్యనారాయణరెడ్డి, నెమ్మాది భిక్షం, తూడి నర్సింహారావు పాల్గొన్నారు. కాగా, బీఆర్ఎస్ సభ విజయవంతం కావాలని విశ్రాంత ఉద్యోగి నర్సింహాచారి జగదీష్‌రెడ్డికి రూ.1016లను చెక్కు ద్వారా విరాళం అందజేశారు.

హుజూర్‌నగర్‌లో ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి సభకు జిల్లాలోని ఒక్కొక్క మిల్లు నుండి కోటి రూపాయల చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మిల్లర్లతో కుమ్మక్కైందని, అందుకే బస్తా ధాన్యం ధర రూ.1200లు, 1500లు అంటున్నారని విమర్శించారు. మిల్లర్లు, ప్రభుత్వం కుమ్మక్కు అవటంతో కనీస మద్దతు ధర 2,320, బోనస్ 500 కలిపి 2,820 రావల్సి ఉండగా, తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. హుజూర్‌నగర్ నుండే కాంగ్రెస్ పార్టీ ఖాళీ అవుతుందన్నారు.

నీళ్లు, నియామకాల్లో మోసం చేసిన కాంగ్రెస్

బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 14, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ నీళ్లు, నియామకాల విషయంలో ప్రజలను మోసం చేసిందని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. యాదాద్రి జిల్లా గుట్టలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి లక్షల ఎకరాలకు సాగునీరు అందించి ఎంతో మంది రైతులను ఆదుకుంటే సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరాన్ని పండబెట్టి రైతుల భూములను ఎండబెట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ ఇచ్చిన నోటిఫికేషన్లతోనే ఉద్యోగాలు భర్తీ చేశారే తప్ప, కొత్తగా ఇచ్చిందేమీలేదని, నిరుద్యోగుల గురించి మాట్లాడే నైతిక హక్కు ఆయనకు లేదన్నారు. విద్యార్థులకు రూ.5లక్షల రుణాలు ఇస్తానని, విద్యార్థినులకు ద్విచక్రవాహనాలు ఇస్తానని ఇప్పటి వరకు అందజేయలేదన్నారు. వీటన్నింటినీ ప్రశ్నించేందుకే వరంగల్‌లో రజతోత్సవ సభకు విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నేత తుంగబాలు మాట్లాడుతూ రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు రాయగిరి నుంచి గుట్ట స్వామి వారి పాదాల వరకు వెయ్యి మంది విద్యార్థులతో పాదయాత్ర నిర్వహించామన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, బొగ్గు శివకుమార్, రమేష్ యాదవ్, భాను, మున్నా, ఎండీ.అజ్జు, మన్నె ప్రభాకర్, పాల్గొన్నారు.



రాయగిరి నుంచి పాదయాత్రగా వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

బహిరంగ సభ విజయవంతం చేయాలి

భువనగిరి రూరల్, యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు.

సోమవారం బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్‌తో కలిసి భువనగిరి శివారులోని రాయగిరి నుంచి వడాయిగూడెం మీదుగా యాదగిరిగుట్ట వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నార్మాక్స్ డైరెక్టర్ కస్తూరి పాండు, నాయకులు ఒగ్గు శివకుమార్, పెంట నితీష్, మట్ట ధనుంజయ, కల్లూరి రామచంద్రారెడ్డి, ప్రవీణ్ రెడ్డి, కల్లూరి రాంచంద్రారెడ్డి, కర్రె వెంకటయ్య, కసావు శ్రీనివాస్‌గౌడ్, మిట్ట వెంకటయ్య గౌడ్, పాపట్ల నరహరి, తదితరులు పాల్గొన్నారు.

సిరులు కురిపిస్తాయని సాగుచేస్తే..

- పంట చేతికి వచ్చినా దిగుబడి తగ్గిన సన్నరకం ధాన్యం
- తాలు పోయి.. తూకాల్లేక దిగాలు
- ఐదీ సాగర్ ఆయకట్టు అన్నదాత పరిస్థితి

●6లో..



అటవీ భూముల్లో చెలరేగిన మంటలు

- మంటలను అదుపుచేసిన అగ్నిమాపక సిబ్బంది
- అడవిదేవులపల్లి మండలంలో ఘటన

●6లో..

ఆలయంలో ఆభరణాలు, నగదు అపహరణ



తెరిచి ఉన్న ఆలయంలోని బీరువా

నేరేడుచర్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఆలయంలో చొరబడి దొంగలు ఆభరణాలు, నగదు అపహరించారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపాలిటీ పరిధిలోని కమలానగర్‌లోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం... దేవాలయం ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి దొంగలు లోపలికి ప్రవేశించి సీతమ్మ వారి 15 గ్రాముల బంగారు ఆభరణాలు, 500 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.20వేలు నగదు అపహరించారు. సమాచారం అందుకున్న క్లూస్‌టీం వివరాలు సేకరించింది. ఆలయ చైర్మన్ యడవెల్లి వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొత్తపేటలో విషాదఛాయలు



గణేష్, ప్రవీణ్(ఫైల్)

కేతేపల్లి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం బస్‌స్టేజీ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందడంతో మండలంలోని కొత్తపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల్లో ఒకరు మాజీ సర్పంచ్ అప్పాల కొండయ్య ఏకైక కుమారుడు అప్పాల గణేష్ అలియాస్ ఆదిత్య(26), మరొకరు స్థానిక రేషన్ డీలర్ పూర ముత్తయ్య చిన్న కుమారుడు ప్రవీణ్(27). గణేష్ తండ్రి మాజీ సర్పంచ్ అప్పాల కొండయ్య కొన్నేళ్ల క్రితం మృతిచెందాడు. డిగ్రీ పూర్తిచేసిన గణేష్ హైదరాబాద్‌లో డ్రోన్ ఆపరేటర్‌గా ప్రైవేట్ ఉద్యోగంచేస్తూ తల్లికి అండగా ఉంటున్నాడు. పూర ప్రవీణ్ తండ్రి దివ్యాంగుడైన పూర ముత్తయ్య నిరుపేద కుటుంబానికి చెందిన వాడు. ఈయనకు ఇద్దరు కుమారులుకాగా చిన్నకుమారుడు ప్రవీణ్ స్థానికంగా కిరాణ దుకాణం నిర్వహిస్తూ తండ్రికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇరువురు మిత్రులు కలిసి ఆదివారం గణేష్‌కు చెందిన బైక్‌పై సూర్యాపేట వెళ్లే క్రమంలో చీకటిగూడెం బస్‌స్టేజీ వద్ద లారీని ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాల వద్ద కుటుంబసభ్యులు విలపిస్తున్న తీరుతో స్థానికులు కంటతడిపెట్టారు. మృతదేహాలను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో సందర్శించి నివాళులర్పించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను గ్రామానికి తీసుకువచ్చిన కుటుంబసభ్యులు సోమవారం సాయంత్రం అంత్యక్రియలు పూర్తిచేశారు. మృతుల కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివతేజగౌడ్ తెలిపారు.

ఆలయంలో నిలిచిన పూజలు

● బ్రహ్మోత్సవాల నిర్వహణపై ధర్మకర్త, గ్రామస్థుల మధ్య వివాదం



దేవాలయం వద్ద పహారా కాస్తున్న పోలీసులు

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 14, (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని దాతరుపల్లి గ్రామంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో రెండు రోజుల నుంచి పూజలు నిర్వహించడం లేదు. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల విషయంలో ఆలయ ధర్మకర్త మూల రాజు, మధ్య గ్రామస్థుల వారం రోజులుగా వివాదం నెలకొంది. దీంతో ఈ నెల 13వ తేదీ నుంచి 15వరకు జరగాల్సిన బ్రహ్మోత్సవాలు వాయిదా పడ్డాయి. 23 సంవత్సరాలుగా స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను గ్రామస్థుల నుంచి డబ్బులు వసూలు చేయకుండా తానే నిర్వహిస్తున్నానని ధర్మకర్త మూల రాజు వాదిస్తున్నారు. తమను విస్మరించి ధర్మకర్త రాజు వంటెద్దు పోకడతో తమను విస్మరిస్తున్నాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు మరో తేదీ ఖరారు చేసి నిర్వహించాలని గ్రామస్థులు పట్టుపట్టారు. అనంతరం పోలీసులను ఆశ్రయించారు. ఇరు వర్గాలు చర్చించుకొని ఓ నిర్ణయం తీసుకొని బ్రహ్మోత్సవాలు నిర్వహించుకోవాలని పోలీసులు సూచించారు. శని, ఆదివారం పోలీసులు ఆలయం వద్దే పహారా కాశారు. వాయిదాపడిన బ్రహ్మోత్సవాలను ధర్మకర్త, ఆయన అనుచరులు, గ్రామస్థులు కలిసి నిర్వహిస్తారా? పూర్తిగా వాయిదా పడతాయా అని చర్చ జరుగుతోంది. బ్రహ్మోత్సవాల నిర్వహణ విషయంలో మూలరాజు తమపై చిన్నచూపు చూడడంతో వివాదం నెలకొందని గ్రామస్థులు బత్తిని బాలరాజు, బైరగాని పాండు, శేఖర్ ఆరోపించారు. గ్రామస్థుల సమష్టి నిర్ణయంతో అందరూ కలిసి సమయం తీసుకొని తేదీ ఖరారు చేసి బ్రహ్మోత్సవాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు.

కుక్కల దాడిలో లేగ దూడ మృతి

ఆలేరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో లేగ దూడ మృతి చెందింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం పటేల్‌గూడెంలో ఆదివారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి రైతు తన లేగ దూడను వ్యవసాయ బావి వద్ద తాడుతో కట్టేసి ఇంటికి వచ్చాడు. రాత్రి వీధి కుక్కలు లేగదూడపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందింది. సోమవారం ఉదయం అక్కడకు వెళ్లిన రైతు చూడగా లేగ దూడ మృతిచెంది ఉండడంతో విలపించాడు. ప్రభుత్వం పశువుల బీమా ద్వారా ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

వరకట్న వేధింపులతోనే నవ వధువు ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): నవ వధువు మృతికి వరకట్న వేధింపులే కారణమని పోలీసులు తెలిపారు. సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం అనాజీపురానికి చెందిన జెల్ల గాయత్రి(19)ని చౌటుప్పల్‌కు చెందిన జెల్ల సంతోష్‌తో మార్చి 16న వివాహం జరిగింది. వివాహ సమయంలో ఎలాంటి కట్నకానుకలు చెల్లించలేదు. వివాహమైన వారం రోజుల నుంచి వరకట్నం కోసం భర్త సంతోష్ కుమార్, అత్తమామలు దశరథ, జయలక్ష్మి వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో మనస్తాపం చెందిన గాయత్రి ఈ నెల 13న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గాయత్రి అంత్యక్రియలు సోమవారం చౌటుప్పల్ పట్టణంలో జరిగాయి. భర్త సంతోష్‌కుమార్ తలకొరివి పెట్టారు. తన మనుమరాలు మృతికి భర్త, అత్తమామలే కారణమని గాయత్రి తాత గుచ్చ సహదేవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

15 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

మాడ్గులపల్లి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని గజలాపురం గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం కురియా తండాకు చెందిన ధనావత్ శ్రీనునాయక్ గజలాపురం పరిసర గ్రామాల్లో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని గజలాపురంలోని గుండెపురి భిక్షం ఇంట్లో నిల్వ చేశాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెళ్లి పరిశీలించగా 15బస్తాల బియ్యం(7.5క్వింటాళ్లు) ఉన్నాయి. అక్రమంగా బియ్యం తరలిస్తున్న శ్రీనునాయక్‌పై ఏఎస్‌ఐ జాఫర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సిరులు కురిపిస్తాయని సాగుచేస్తే



కొనుగోలు కేంద్రాల్లో ఉన్న దొడ్డు రకం ధాన్యం

» పంట చేతికి వచ్చినా దిగుబడి తగ్గిన సన్న రకం ధాన్యం
» తాలు పోయి.. తూకాల్లేక దిగాలు
» ఇదీ సాగర్ ఆయకట్టు అన్నదాత పరిస్థితి

మిర్యాలగూడ(వ్యవసాయం), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): సిరులు కురిపిస్తాయని సన్నాలు సాగుచేసిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. పంట చేతికి వచ్చానా తాలు పోయి.. తూకాల్లేక అన్నదాత దిగాలు చెందుతున్నాడు. సాగర్ ఆయకట్టులో ఇదీ రైతుల పరిస్థితి. సన్నాలకు తెగుళ్ల వ్యాప్తి అధికం కావడంతో పాటు అధిక ఉష్ణోగ్రతలకు తట్టుకోలేక దిగుబడులు పడిపోయాయి. మార్కెట్లో మద్దతు ధర రాక రైతులు నష్టాలపాలయ్యా రు. సాగర్ ఆయకట్టులో దశాబ్దాకాలంగా యాసంగి లో ఎంటీయూ -1010 వంటి దొడ్డు రకాలను రైతులు సాగు చేసేవారు. ఐదేళ్లుగా సన్నాలకు మార్కెట్లో డిమాండ్ ఉంది. మిల్లర్లు తేమ శాతంతో సంబంధం లేకుండా పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండడంతో వానాకాలంతో పాటు యాసంగిలోను 80శాతం మేర సన్నాలను(ప్రైవేట్ రకాలు) రైతులు సాగు చేస్తున్నారు. ప్రతిఏటా మద్దతుకు మించి ధర పొందిన రైతులు ఈ ఏడాది ధాన్యం ధర లేక రైతులు దిగాలు పడ్డారు. గత ఏడాది క్వింటాకు రూ.2300 నుంచి రూ.2700లు పలికిన ధాన్యానికి ప్రస్తుతం మద్దతు రూ.2320ల ధర దక్కడం లేదు. చింట్ల రకం సన్న ధాన్యానికి రూ.2200లు, హెచ్ఎమ్‌టీ వంటి రకాలకు రూ.2వేలకు మించి వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. సన్న రకాలకు ఇంత తక్కువ ధర పలకడం ఆయకట్టు చరిత్రలో ఇదే ప్రథమం అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధిక ఉష్ణోగ్రతలు తట్టుకోలేక..

సాధారణంగా సన్న గింజ రకాలు వానాకాలం అనువైనవి. యాసంగిలో కొంత మేర చలి ఉండడంతో పాటు అధిక ఉష్ణోగ్రతలను ఇవి తట్టుకోలేవు. తెగుళ్ల వ్యాప్తితో పాటు గింజ కట్టు సరిగా ఉండదు. పొలం నిండుగా కనిపించినా తూకాలు రావు. ఎకరానికి 35బస్తాలు దిగుబడులు రావడం కష్టమని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు.

కోత మిషన్‌లో ట్యాంకులో పది బస్తాల ధాన్యానికి (బస్తాకు 70కిలోలు) నిండుతుంది. ఈ సన్న రకం ధాన్యంలో తాలు ఉండడంతో ఏడు బస్తాల ధాన్యానికి కోత మిషన్ ట్యాంకు నిండుతుంది.. ట్రాక్టర్ బోరెంలో పూర్తిస్థాయిగా నింపితే 80బస్తాల వరకు పడుతుంది. ప్రస్తుతం డిసెంబరు చివరి, జనవరి మాసంలో నాట్లు వేసిన వరి ఈ నెలలో కోతకు రావడంతో గింజ చాలా వరకు తాలు పోయిందని, బోరెంలో నిండా పోసినా 65-70బస్తాలు రావడం లేదని రైతులు వాపోతున్నా రు. ధాన్యం ఇంకా ఆరితే తూకాలు చాలా తగ్గే అవకాశం ఉండడంతో మద్దతు ధర రాక పోయినా రైతు లు మిల్లర్లకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో క్వింటాకు మద్దతు ధర రూ.2350లతో పాటు రూ.500ల బోనస్ వస్తున్నా.. ధాన్యాన్ని 17 తేమ శాతం వచ్చే వరకు ఆరబెట్టాల్సి రావడంతో తప్పని పరిస్థితుల్లో మిల్లర్లు ఇచ్చిన ధరకే ధాన్యం విక్రయిస్తున్నామని రైతులు చెబుతున్నారు. దీంతో పంటసాగు గిట్టుబాటు కావడం లేదనే ఆందోళన అన్నదాతల్లో నెలకొంది.

సన్నాలు తాలు పోతున్నాయి



ఐదెకరాల్లో చింట్లు రకం వరి సాగు చేశా. రెండు రోజుల క్రితం పంట కోశా. అధిక ఉష్ణోగ్రతలకు చాలా వరకు తాలు గింజ పోయింది. తూకాలు తగ్గాయి. ఎకరానికి 35బస్తాలు రావడం కష్టంగా మారింది. క్వింటాకు రూ2200 విక్రయించాను. సన్నాల సాగు గిట్టుబాటు కాలేదు. మరో ఆరు ఎకరాలలో దొడ్డు రకం సాగు చేశా. ఎకరానికి 45-50 బస్తాల వరకు దిగుబడులతో పాటు మంచి తూకాలు వస్తున్నాయి. ఈ రకాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాను.

- అనుముల శ్రీనివాస్‌రెడ్డి, రైతు, నల్లగొండ జిల్లా త్రిపురారం.

దొడ్డు రకాలతో రైతులకు మేలు..

ఆయకట్టులో ఈ యాసంగిలో కేవలం 20శాతం మేర మాత్రమే దొడ్డు రకం వరిసాగు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో 97శాతం మేర వరిదొడ్డు రకాలే ఉన్నాయి. వాటికి పూర్తిస్థాయిలో రైతులు మద్దతు ధర పొందుతున్నారు. ఈ రకాలు యాసంగికి అనుకూలమైనవి కావడంతో తక్కువ పెట్టుబడితో ఎకరానికి 45-50బస్తా వరకు పంట దిగుబడులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. తూకంతో పాటు గింజ నాణ్యతగా ఉండటంతో రైతులకు ప్రయోజనం చేకూరింది.. అందుకు భిన్నంగా సన్నాలు సాగు గిట్టుబాటు కాక రైతన్నకు నష్టం వాటిల్లింది. దొడ్డు రకాలు సాగు చేస్తే మంచి ఫలితాలు వచ్చేయని అటు ఇటు కావడం అంటే ఇదేనేమో అని రైతులు వాపోతున్నారు.

ఏటీసీలతో ఉపాధి భరోసా!

(5వ పేజీ తరువాయి)

బాధ్యత కూడా ఏటీసీలే తీసుకుంటాయని ప్రభుత్వం చెబుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా దీర్ఘకాలిక కోర్సుల ద్వారా ఏటా 5,860 మంది, స్వల్పకాలిక కోర్సుల ద్వారా 31,200 మందికి ఈ ఏటీసీల్లో శిక్షణ ఇవ్వనుండగా, ఉమ్మడి జిల్లాలో దీర్ఘకాలిక కోర్సుల ద్వారా ఏటా 854 మందికి, స్వల్పకాలిక కోర్సుల ద్వారా 3,360 మందికి శిక్షణ అందనుంది.

రూ.34కోట్లతో నిర్మాణాలు

టాటా టెక్నాలజీస్ లిమిటెడ్, రాష్ట్ర ప్రభుత్వం కలిసి నిర్మిస్తున్న ఈ ఏటీసీల నిర్వహణను పదేళ్ల పాటు టీటీఎల్ సంస్థనే చూడనుంది. ఏటీసీల ఏర్పాటులోనూ టీటీఎల్ సంస్థ 86.74శాతం వ్యయాన్ని భరిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం 13.26శాతం ఖర్చు చేస్తోంది. ఒక్కో ఏటీసీకి సగటున రూ.34కోట్ల వరకు నిధులు కేటాయించారు. వీటిద్వారా వచ్చే పదేళ్లలో 4లక్షల మందికి ఉపాధి, ఉద్యోగకల్పన నిమిత్తం శిక్షణ ఇస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాలో నెలకొల్పుతున్న ఏడు ఏటీసీలలో ఇప్పటికే భవనాల నిర్మాణాలు పూర్తవగా, ల్యాబ్‌లు, వర్క్‌షాపులు, ఇతర బోధనోపకరణాల ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ మొదలైందని అధికారులు తెలిపారు. ప్రతీ ఏటీసీలో కోర్సుకు ఇద్దరు చొప్పున మొత్తం 12మంది ఇన్‌స్ట్రక్టర్లను నియమిస్తారు. మొత్తం ఉమ్మడి జిల్లాలో 84మంది ఇన్‌స్ట్రక్టర్లను టీటీఎల్ సంస్థనే నియమించి, వారికి వేతనాలు అందిస్తుంది. వీరిలో ప్రతీ ఏటీసీకి ఇద్దరు చొప్పున ఇన్‌స్ట్రక్టర్లను ఇప్పటికే టీటీఎల్ నియమించిందని, విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి మిగిలినవారిని నియమిస్తారని అధికారులు తెలిపారు. అదేవిధంగా ప్రతీ ఏటీసీలో కనీసం నలుగురు చొప్పున నాన్‌టెక్నికల్ సిబ్బందిని నియమించే అవకాశం ఉంది. ఏటీసీలలో ఆరు దీర్ఘకాలిక కోర్సులు ప్రవేశపెడుతున్నారు. అందులో మూడు కోర్సులకు ఏడాది కాలవ్యవధి ఉంటే, మరో మూడు కోర్సులు రెండేళ్ల కాలవ్యవధిలో పూర్తవుతాయి. ప్రతీ ఏటీసీలో ఆరు కోర్సుల్లో ఏటా 122 మంది విద్యార్థులకు శిక్షణ అందుతుంది.

నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో యూడైస్ సర్వే

(5వ పేజీ తరువాయి)

డైట్ కళాశాలల ప్రిన్సిపాల్ లేదా జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ సర్వేను పర్యవేక్షిస్తారు. ఒక్కొక్కరికి పది పాఠశాలలను కేటాయించారు. ఐదు రోజుల పాటు సర్వే బృందాలు ప్రతీ రోజు రెండు పాఠశాలలను సందర్శించి సర్వే నిర్వహిస్తాయి. ప్రస్తుతానికి ప్రభుత్వ, కేజీబీవీ, మోడల్స్ స్కూళ్లలో సర్వే జరగనుంది. మిగతా ప్రభుత్వ యాజమాన్య ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో రెండో దశలో సర్వే నిర్వహించనున్నట్టు తెలుస్తోంది. అయితే ప్రైవేట్ పాఠశాలల్లో కూడా ఇదే తరహా సర్వేను నిర్వహిస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లాలో సుమారు 2,800 పాఠశాలల్లో 250మంది బీఈడీ, డీఈడీ విద్యార్థులు ఐదు రోజుల పాటు సందర్శిస్తారు. ఇప్పటికే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యూడైస్ వివరాలను రికార్డుల రూపంలో సిద్ధం చేసి ఉంచారు. ఆ రికార్డులను వీరు పరిశీలించి ధ్రువీకరిస్తారు.

యువత జార్జిరెడ్డి ఆశయాలు సాధించాలి



జార్జిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేస్తున్న పీడీఎస్‌యూ, పీవోడబ్ల్యూ నాయకులు

సూర్యాపేటటౌన్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ వ్యవస్థాపకుడు జార్జిరెడ్డి ఆశయాలను నేటి యువత సాధించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్‌కుమార్, పీవోడబ్ల్యూ జిల్లా ప్రధానకార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ సమస్యలను పోరాటాల ద్వారా పరిష్కరించుకోవచ్చునని చాటిన వ్యక్తి జార్జిరెడ్డి అన్నారు. న్యూక్లియర్ ఫిజిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించి విద్యార్థులకు అండగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరం విజయ్, వంటికొమ్ముల నగేష్‌రెడ్డి, బీమనపెల్లి ప్రకాష్, భవాని, రేణుక, మారసాని చంద్రకళ, జయమ్మ, సంతోషిమాత, గొడ్డలి నర్సయ్య, సయ్యద్, గులాం హుస్సెన్, లక్ష్మీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూముల్లో చెలరేగిన మంటలు

● మంటలను అదుపుచేసిన అగ్నిమాపక సిబ్బంది ● నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలంలో ఘటన





అడవిదేవులపల్లిలోని అటవీ ప్రాంతంలో దగ్ధమవుతున్న చెట్లు


అడవిదేవులపల్లి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలంలోని అటవీభూముల్లో మంటలు చెలరేగి రెండు ఎకరాల పరిధిలో చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. అడవిదేవులపల్లి మండలం కేంద్రం నుంచి సత్రశాలకు వెళ్లే దారిలో 53వ బీట్‌లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు అగ్నిప్రమాద సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు, అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... అడవిదేవులపల్లి ఫారెస్ట్ బీట్‌లో 900 హెక్టార్లల్లో అడవులు వ్యాపించి ఉన్నాయి. సత్రశాలకు వెళ్లే దారిలో పలు రకాల చెట్లతో కూడిన అడవి విస్తరించి ఉంది. సోమవారం కొంతమంది బాటసారులు సిగరెట్ తాగి ఆర్పివేయకుండా పడవేయడంతో గడ్డి తుప్పలకు నిప్పు అంటుకొని మంటలు చెలరేగినట్లు తెలిపారు. అటవీశాఖ వాచర్లు మంటలు ఆర్పడానికి ప్రయత్నించగా గాలివాటుకు మరింతగా చెలరేగాయి. దీంతో మిర్యాలగూడ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో పాటు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. మిర్యాలగూడకు చెందిన ఐదుగురు ఫైర్‌మెన్లు ఫైరింజన్‌తో అరగంటలో సంఘటనాస్థలికి చేరుకున్నారు. ఇద్దరు వాచర్లు, బీట్ ఆఫీసర్ సహాయంతో మంటలను ఆర్పివేశారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గౌతమ్ మాట్లాడుతూ 53వ బీట్‌లో సంఘటన జరిగిన ప్రాంతంలో అటవీభూముల్లో రెండువైపులా దారి ఉండటం, అగ్ని ప్రమాదం సంభవించిన నిమిషాల వ్యవధిలోనే ఫారెస్ట్ వాచర్లు స్పందించి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. సిబ్బంది అప్రమత్తమై ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించి మంటలు ఆర్పివేయడంతో పెద్దగా నష్టం సంభవించలేదని అన్నారు. రెండు ఎకరాల పరిధిలో చిన్నచిన్న ముళ్ల పొదలు, పలు రకాల చెట్లు దగ్ధమయ్యాయని తెలిపారు. ఈ అగ్ని ప్రమాదంతో అటవీ జంతువులు, పక్షులకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



అడ్డగూడూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని చౌళ్లరామారం గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన పోగుల నర్సిరెడ్డి పశువులను మేత కోసం తన వ్యవసాయ భూమిలోకి వదిలాడు. ఈ క్రమంలో మేత మేస్తూ ఓ ఎద్దు నర్సిరెడ్డి భూమిలో గల ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పక్క రైతు బోరు మోటారు విద్యుత్ సరఫరా కోసం వేసుకున్న సర్వీస్ వైరు తెగి ఆదివారం సాయంత్రం వీచిన గాలులకు తెగి కింద పడ్డాయి. మేత కోసం వచ్చిన ఎద్దుకు విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది.

నెలల తరబడి పనులు.. ప్రజల అవస్థలు



తొర్రూర్ రోడ్డులో ధ్వంసమైన బీటీ రోడ్డు



అసంపూర్తి డ్రైనేజీ నిర్మాణం

తిరుమలగిరి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలోని గౌరెల్లి- కొత్తగూడెం జాతీయ రహదారి పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. దీంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ జాతీయ రహదారి తిరుమలగిరి మండలపరిధిలో 15కిలోమీటర్ల మేర పనులు సాగుతున్నాయి. మునిసిపల్ కేంద్రంలో తొర్రూర్- వలిగొండ రోడ్డులో నెలల తరబడి పనులు సాగడంతో ఇంటి యజమానులు అవస్థలు పడుతున్నారు. రోడ్డుకు రెండు వైపులా వర్షపు నీళ్లు వెళ్లడానికి డ్రైనేజీలు నిర్మిస్తున్నారు. కొన్నిచోట్ల గుంతలు తవ్వి వదిలేశారు. దీంతో మంచినీటి పైపులు పగిలి, నీటికి అవస్థలు పడుతున్నారు. గతంలో ఉన్న పాత డ్రైనేజీలను పెకిలించడంతో సెప్టిక్ ట్యాంకుల నీళ్లు రోడ్లపై పారుతూ దుర్వాసన వెదజల్లుతుండంతో నిలబడలేకపోతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. నెలల తరబడి పనులు చేయడంతో క్రాస్‌రోడ్‌లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. రహదారి పనుల్లో నూతనంగా వేస్తున్న బీటీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నెల రోజుల క్రితం వేసిన బీటీ చిన్న వర్షానికే రోడ్డు కింద మట్టి కొట్టుకుపోవడంతో, రోడ్డు ముక్కలుగా విరిగి ఊడింది. రహదారి నిర్మాణంలో గతంలో ఉన్న రోడ్డు మధ్య నుంచి 15మీటర్ల వెడల్పుతో రోడ్డును వెడల్పు చేస్తున్నారు. కొన్నిచోట్ల 15మీటర్ల కంటే తక్కువగా పనులు చేస్తున్నారని ఇళ్ల యజమానులు ఆరోపిస్తున్నారు.

దుమ్ము, దూళి, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం

నెలల తరబడి రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండంతో, నిత్యం దుమ్ము, ధూళి, దుర్వాసనతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. పనులు త్వరగా పూర్తిచేయాలి.

● అయిత శ్రీనివాస్, తిరుమలగిరి.

పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం

మండలంలో జాతీయ రహదారి పనులు దాదాపు పూర్తయ్యాయి. మునిసిపల్ కేంద్రంలో మాత్రమే పనులు జరగాల్సి ఉంది. డ్రైనేజీ, సర్వీసు రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయిస్తాం.

● రామరాజు, ఏడబ్ల్యూఈ.



రోడ్లపై పారుతున్న మురుగునీరు

సమయాన్ని వినియోగించుకుని
మంచి స్థాయికి ఎదగాలి

పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం



విద్యార్థితో పుస్తకాన్ని చదివించి సామర్థ్యాన్ని తెలుసుకుంటున్న కమిషన్ చైర్మన్ వెంకటేశం

సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమయాన్ని చక్కగా వినియోగించుకుని మంచి స్థాయిలో ఉండాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం కోరారు. మండలంలోని సర్వేల్‌లోని గురుకుల పాఠశాలను సోమవారం పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం, కమిషన్ సభ్యులు అమీరుల్లా ఖాన్, పాల్వాయి రజని, రాంమోహన్‌రావులు సందర్శించారు. 1983-84 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన బుర్రా వెంకటేశం తాను చదివి విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాల పరిసరాలను పరిశీలించారు. తన చిన్నతనపు జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో పుస్తకాన్ని చదివించి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకటేశం మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తెలంగాణకు గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. బుర్రా వెంకటేశం రచించిన 'అమ్మ చేసిన బొమ్మను' అనే పాటపై విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో గురుకుల విద్యాలయ సంస్థ కార్యదర్శి సీహెచ్.రమణకుమార్, డిప్యూటీ కార్యదర్శి ప్రసాద్, పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. గురుకుల విద్యాలయాన్ని సందర్శించిన బుర్రా వెంకటేశంను గురుకుల విద్యాలయ సంస్థ కార్యదర్శి రమణకుమార్ శాలువాతో ఘనంగా సన్మానించారు.

మంత్రి పదవిపై ఉన్న ధ్యాస
అభివృద్ధిపై లేదు

- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్ , ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కొమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవిపై ఉన్న ధ్యాస నియోజకవర్గం అభివృద్ధిపై లేదని మునుగోడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. సోమవారం మండల పరిధిలోని దామెరలో ఓ ఫంక్షన్ హాల్‌లో చౌటుప్పల్, నారాయణ పూర్ మండలాల బీఆర్ఎస్ పార్టీ రజోత్సవ సభ సన్నాహక సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పదవి లేకపోతే అభివృద్ధి చేయలేవా అని ప్రశ్నించారు. మంత్రి పదవి లేకున్న ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేశానని తెలిపారు. కాంట్రాక్టు కోసమే మంత్రి పదవి అడుతున్నాడని , అభివృద్ధి కోసం కాదని దుయ్యబట్టారు. తాను గతంలో ఇచ్చిన నిధులతో చేసిన అభివృద్ధి పనులకు రాజగోపాల్ రెడ్డి కొబ్బరికాయలు కొడుతున్నాడని విమర్శించారు. ఎమ్మెల్యేగా గెలిచి 15నెలలు అవుతున్నా ఒక్క అభివృద్ధి పని చేపట్టలేదని విమర్శించారు. కార్యక్రమంలో కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవికుమార్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గిర్కాటి నిరంజన్ గౌడ్, నారాయణపురం మండల అధ్యక్షుడు నర్సింహ, సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, ఆందోళ్ శంకర చారి, మాధవరెడ్డి, వెంకటేశ్ యాదవ్, దేవేందర్ రెడ్డి, మల్లేశ్ గౌడ్, శ్రీనివాస్, కొత్త పర్వతాలు పాల్గొన్నారు.

రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ మెంబర్‌గా వర్రె వెంకటేశ్వర్లు



నల్లగొండ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పోలీసు కంప్లైంట్స్ అథారిటీ మెంబర్‌గా ప్రముఖ న్యాయవాది వర్రె వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. రాష్ట్ర హోంశాఖ ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి శివశంకర్ రావును చైర్మన్‌గా, వేంకటేశ్వర్లు సభ్యుడిగా నియామకమయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం సదర్శాపురానికి చెందిన వెంకటేశ్వర్లు ప్రాథమిక విద్యాభ్యాసం గుండాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సాగింది. నల్లగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, ఎన్‌జీ కాలేజీలో బీఎస్సీ పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎంబీఏ, ఎల్ఎల్ఎం, పీహెచ్డీ (లా) పూర్తి చేశారు. హైకోర్టు న్యాయవాదిగా పనిచేశారు. 2012లో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్‌గా నియమితులయ్యారు. కొంతకాలం ప్రధాన కమిషనర్‌గా వ్యవహరించారు. ఇటీవలి వరకు ఆ బాధ్యతల్లో ఉన్నారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం తాజాగా రాష్ట్ర పోలీస్ కంప్లైంట్ అథారిటీ సభ్యుడిగా నియమించింది. తనపై నమ్మకంతో రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తానని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయస్థాయి ఉత్తమ కరాటే మాస్టర్‌గా శ్రీనివాస్



ఉత్తమ కరాటే మాస్టర్ అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్

నిడమనూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ఉత్తమ కరాటే మాస్టర్‌గా నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని తుమ్మడం గ్రామానికి చెందిన పోతుగంటి శ్రీనివాస్ ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో జరిగిన 6వ జాతీయస్థాయి కరాటే పోటీల్లో శ్రీని వాస్‌కు ఉత్తమ మాస్టర్ అవార్డును ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ టెక్నికల్ డైరెక్టర్లు సత్యనారాయణ, బూడిద సైదులు అందజేశారు. గత రెండు దశాబ్దాలుగా వేలాది మంది విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇచ్చి వారిని జాతీయ స్థాయిలో గోల్డ్, సిల్వర్ పతకాలు సాధించేందుకు శ్రీనివాస్ దోహదం చేసినందున ఆయనకు ఈ అవార్డు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు జాతీయస్థాయిలో ఉత్తమ కరాటే మాస్టర్ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదం చేస్తున్నందున విద్యార్థులు ముఖ్యంగా బాలికలు కరాటే నేర్చుకోవాలని సూచించారు. తనకు అవార్డు అందజేసిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పంచనారసింహుడికి 'గిరి' ప్రదక్షిణోత్సవం



తెల్లవారుజామున గిరిప్రదక్షిణలో ఆలయ ఈవో భాస్కర్‌రావు,ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, మాలధారులు

- స్వాతి నక్షత్ర వేడుకలు.. గిరిప్రదక్షిణ మొక్కులు
- ఉప్పొంగిన భక్తి పారవశ్యం
- ప్రదక్షిణ ప్రారంభించిన ఈవో భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయంలో సోమవారం స్వాతి వేడుకలు. గిరిప్రదక్షిణ పర్వాలు వైభవం గా కొనసాగాయి. ప్రతీ నెల స్వాతి నక్షత్రం రోజున ఆలయ ముఖ మండపంలో వేకువజామున వేద పం డితుల వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ అష్టోత్తర శతఘటాభిషేక పూజలు నిర్వహించడం ఆచారం. కాగా, కొండకింద వైకుంఠ ద్వారం చెంత దేవస్థానం ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణను ఈవో ఏపూరి భాస్కర్‌రావు ప్రారంభించారు. శని,ఆది, సోమవారం వరుస సెలవు రోజులు కావడం తో గతం కంటే రెట్టింపు కాగా ఈ సారి నృసింహ మాలధారణ భక్తులు గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. స్వా మివారి మధ్యాహ్నం ఆరగింపు వేళ వరకు సుమారు 20వేల మంది భక్తులు సామూహిక గిరిప్రదక్షిణ చేశా రు. ప్రదక్షిణలో వివిధ ప్రాంతాల నుంచి వాహనాలపై తరలివచ్చిన భక్తుల సమక్షంలో ఉదయం 5.45గంటల కు వైకుంఠ ద్వారం కూడలి వాహనాలు, భక్తులతో కిక్కిరిసిపోయి భక్తుల గోవింద నామంతో ప్రతిధ్వనించింది. గిరిప్రదక్షిణలో స్వామివారిని స్తుతిస్తూ ప్రత్యేకంగా కళాకారులు వేషధారణలు, కళాకారుల కోలాటాలు, కూచిపూడి నృత్యాలు, భక్తుల భజనలు, కీర్తనలతో హో రెత్తించారు. రెండున్నర కిలోమీటర్ల మేర సుమారు 45 నిమిషాల్లో గిరిప్రదక్షిణ ముగియగా కొండెక్కి కొంత మంది మొక్కులు తీర్చుకున్నారు. గిరిప్రదక్షిణ మార్గం భక్తులు బారులు తీరారు. కొండ వాయువ్య దిక్కులో బ్రిడ్జి కింద కాలినడక కొండెక్కే భక్తులకు ప్రత్యేక దర్శన క్యూలైన్‌లో వెళ్లేందుకు ఉచితంగా టికెట్లు ఆలయ అధికారులు పంపిణీ చేశారు. కొండకింద వైకుంఠద్వారం కూడలికి (ఉత్తరం,పడమర,తూర్పు) మూడు వైపుల బారీగా పార్కింగ్ చేసిన వాహనాలతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రదక్షిణ చేపట్టేందుకు ఫుట్‌పాత్ సౌకర్యం లేకపోవడం చేత వాహనాల మధ్య నుంచి భక్తులు వెళ్లేటప్పుడు ఆటంకం కలిగింది. యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్ కుమార్ సారథ్యంలో పోలీసులు బారికేడ్ల సహాయంతో బందోబస్తు నిర్వహించారు.

అష్టోత్తర పూజలు

ఆలయంలో స్వామివారి స్వాతి నక్షత్రం పురస్కరించుకుని వేకువజామున అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. ముఖమండపంలో 108 వెండి కలశాలు వాటిపై కొబ్బరికాయలు పేర్చి అందులో పంచామృతాలు నింపి పంచసూక్త పఠనాలతో హోమం చేపట్టి ఉత్సవ మూర్తులను, ఆలంకార మూర్తులను అభిషేకించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించి 108 సువర్ణ పుష్పాలతో అర్చించారు. సాయంత్ర స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కాగా స్వామివారి కొండపై సోమవా రం శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామి అమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామివారి శివాలయంలో స్ఫటిక మూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.35,49,759ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ.భాస్కర్ రావు తెలిపారు.

ఆలయానికి బ్యాటరీ వాహనాల అప్పగింత



బ్యాటరీ వాహనాలను ప్రారంభిస్తున్న ఈవో, ఎస్‌బీఐ సీజీఎం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి రెండు బ్యాటరీ (ఎలక్ట్రికల్) వాహనాలు సోమవారం అప్పగించారు. ఎస్బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ చల్లా శ్రీనివాస్‌శెట్టి చేతుల మీదుగా ఆలయ ఈవో ఏపూరి భాస్కర్ రావుకు ప్రోటోకాల్ కా ర్యాలయం చెంత అందజేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల ద్వారా సమకూరిన ఈ రెండు వాహనాలు (ఒక వాహనం సుమారు రూ.8లక్షలు)సుమారు రూ. 16లక్షల ఖరీదు ఉన్నట్లు యాదగిరిగుట్ట బ్రాంచ్ మేనేజర్ రాఘవ తెలిపారు. అంతకు ముందు బ్యాంకు సీజీ ఎం కుటుంబ సమేతంగా బ్యాంకు బృందంతో స్వామివారిని దర్శించుకున్నారు. ముఖ మండపంలో వేద పం డితులు వేదాశీర్వచనం చేయగా ఈవో స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు .కాగా వాహనాలను జెండా ఊపి వాహనాలు ప్రారంభించగా బ్యాంకు సీజీఎం రాజేష్‌కుమార్, జీఎం రవికుమార్‌వర్మ, డీజీఎం వివేక్ జైశ్వాల్, ఆర్ఎం సంజీవ్‌కుమార్‌సాహు, యాదగిరిగుట్ట బ్రాంచ్ మేనేజర్ రాఘవ, ఆలయ అధికారులు డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి, ఏఈవోలు ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, గజ్వేల్లి రమేష్‌బాబు, పర్యవేక్షకులు మాచర్ల రాజన్‌బాబు, నాగుల మహేష్ పాల్గొన్నారు.

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	515.30
టీఎంసీలు	140.8451
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	0
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1,350 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	1,350 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	2

పులిచింతల ప్రాజెక్టు



పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	34.24 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం



పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	626.60 అడుగులు
టీఎంసీలు	0.99
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	385. 52 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	32.63 క్యూసెక్కులు

ఆలయాల భూములు హాంఫట్

- 81 ఎకరాలకు ఉన్నది 40 ఎకరాలే
- సగం మాయం చేసిన పక్క భూముల రైతులు



కొప్పోలులోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం

గుర్రంపోడు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా గుర్రంపోడు కొప్పోలు గ్రామంలో దేవాలయాల భూములు మాయమవుతున్నాయి. 1950లో పెద్ద రైతులు గ్రామంలోని నాలుగు దేవాలయాలకు వంద ఎకరాలు దానంగా ఇచ్చారు. రికార్డుల్లో 81 ఎకరాలుగా నమోదయ్యాయి. ఆ భూములనుపక్క రైతులు ఆక్రమించుకోవడంతో ప్రస్తుతం 40 ఎకరాలే మిగిలాయి. ఆలయ భూముల ఆక్రమణపై గ్రామ దేవాలయ కమిటీ పలుమార్లు తహసీల్దార్‌తో పాటు దేవాదాయ శాఖకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవంగా అన్ని దేవాలయ భూములకు ఏటా రూ.8లక్షల కౌలు రావాల్సి ఉండగా, భూముల అన్యాక్రాంతంతో రూ.3లక్షలకు మించి రావడం లేదు. దీంతో ఆలయాల్లో దూపదీప నైవేద్యాలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

25 ఎకరాలకే కౌలు వేలం

కొప్పోలు గ్రామంలోని సీతారామచంద్ర స్వామి దేవాలయానికి 25 ఎకరాలకు 12 ఎకరాలు, సదాశివాలయానికి 15ఎకరాలకు 13 ఎకరాలు, ఆంజనేయస్వామి దేవాలయానికి 20ఎకరాలకు 15 ఎకరాలు, ఆయోధ్య రామస్వామి దేవాలయానికి 21ఎకరాలకు గుంట భూమి కూడా లేదు. ఇందులో ఆంజనేయస్వామి దేవాలయానికి ఉన్న 15 ఎకరాలను కుటుంబ పోషణ, దూపదేప నైవేద్యాల ఖర్చుల నిమిత్తం ఆలయ పూజారి సాగు చేసుకుంటున్నారు. మిగతా 25ఎకరాలకు మాత్రమే కౌలు వేలం పాట నిర్వహిస్తున్నారు.

సర్వేతోనే సరి. హద్దు రాళ్లు ఏవీ?

సీతారామచంద్రస్వామి దేవాలయ భూముల ఆక్రమణలపై ప్రజావాణిలో గ్రామస్తులు ఫిర్యాదు చేయగా నాలుగు నెలల క్రితం సర్వే చేసి మూడు ఎకరాల భూమిని పక్క రైతుల భూముల నుంచి బయటికి తీశారు. కానీ వీటికి హద్దురాళ్ల పాతకపోవడంతో ఆక్రమణల చెర వీడలేదు.



కొప్పోలు శివారులో కబ్జాలో భూమి

చరిత్ర ఘనం.. నిధుల్లేక నీరసం

గ్రామంలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో భద్రాదిలో రామాలయంలో మాదిరిగా ఏకశిలపై దేవతామూర్తుల విగ్రహాలు ఉన్నాయి. ఇక్కడ పూర్వకాలం నుంచి శ్రీరామనవమి సందర్భంగా ఎడ్లపందాలు, జిల్లా స్థాయి క్రీడాపోటీలు, రథోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. శివాలయానికి వందేళ్ల చరిత్ర ఉంది. పక్కనే గల కోనేరులో నీటి బుగ్గ నుంచి దారాళంగా నీరు వస్తూ వేసవిలోనూ ఎండిపోకుండా ఉండి బుగ్గరామలింగేశ్వర స్వామిగా పేరు కలిగి ఉంది ఇంత పాశస్త్యం గల దేవాలయాల అభివృద్ధికి నిధులు లేక ఆలయ కమిటీలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇక కొప్పోలు - అమలూరు మధ్య గల పురాతన అయోధ్య రామస్వామి ఆలయం ఏనాడు పూజలకు నోచుకోలేదు. భూములు ఉంటే ఆదాయంతో పూజలు నిర్వహించే అవకాశం ఉంటుంది.

సర్వే నిర్వహించాలని కలెక్టర్, ఎమ్మెల్యేకు వినతులు

ఆలయ భూములకు సర్వే నిర్వహించాలని ఆలయ కమిటీ చైర్మన్ అయితగోని పరమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డిని కలిసి వినతిపత్రాలు అందజేశారు. మొదట మార్చి 21న సర్వే నిర్వహిస్తామని అధికారులు చెప్పినప్పటికీ సర్వే నిర్వహించకపోవడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్థులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అసెంబ్లీ సమావేశాల కారణంగా సర్వే నిర్వహించలేకపోతున్నామని, త్వరలోనే నిర్వహిస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ ఫరీద్ వివరించారు. అయినప్పటికీ నేటికి సర్వే నిర్వహించకపోతుండడంతో రాజకీయ ఒత్తిడితోనే సర్వే నిర్వహించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.



సర్వే చేయించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దేవాలయ భూములకు హద్దురాళ్లు పాతాలి



దేవాలయ భూములకు హద్దురాళ్లు పాతాలని పలుమార్లు రెవిన్యూ, దేవాదాయ శాఖ అధికారులను కోరాం. దేవాలయ భూములు పరిరక్షిస్తే ఆలయాలను అభివృద్ధి పర్చి భక్తులకు సౌకర్యాలను కల్పించే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు సర్వే జరిపి ఆలయ భూములను ఆక్రమణ చెర నుంచి విడిపించాలి.

● తెలుకుంట్ల రవికుమార్, కొప్పోలు

త్వరలోనే సర్వే నిర్వహిస్తాం

కబ్జాకు గురైనట్లు చెబుతున్న దేవాలయ భూముల రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. మార్చి 21న సర్వే నిర్వహిద్దామనుకున్నప్పటికీ అసెంబ్లీ సమావేశాల కారణంగా నిలిపివేశాం. త్వరలోనే సర్వే నిర్వహించి దేవాలయ భూములకు హద్దురాళ్లు ఏర్పాటు చేసి ఆలయ కమిటీకి అప్పగిస్తాం.

● ఫరీద్, ఇన్‌చార్జి తహసీల్దార్, గుర్రంపోడు

అంబేడ్కర్ ఆశయాలకు రేవంత్‌రెడ్డి తూట్లు

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్



మల్యాల గ్రామంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

బొమ్మలరామారం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు సీఎం రేవంత్‌రెడ్డి తూట్లు పొడుస్తున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లాలో బొమ్మలరామారం మండలంలోని మల్యాల గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత బంధు స్థానంలో అంబేద్కర్ ఆశయ హస్తం పథకం ద్వారా రూ.12 లక్షలు అందిస్తామని చెప్పి కనీసం ఎస్సీ కార్పోరేషన్‌కు ఒక్కరూపాయి కూడా నిధులు మంజూరు చేయకుండా ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల రుణాలకు ప్రభుత్వం దరఖాస్తు చేసుకోమని చెప్పిందని, రేషన్ కార్డులను మంజూరు చేయకుండా మోసపూరిత హామీలతో ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ అధ్యక్షుడు మైలారం సంజీవ, బీఆర్ఎస్‌పార్టీ మండల అధ్యక్షుడు పొలగాని వెంకటేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ రామకృష్ణ, బోనంకూర మల్లేష్, మైలారం జంగయ్య, మైలారం సుదర్శన్, ఊట్ల రమేష్, నగేష్, మైలారం నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

గట్టుప్పల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్న భూలక్ష్మి కుమార్తె వివాహానికి ఈఎల్‌వీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ భాస్కర్ రూ.50వేల అందజేశారు. సోమవారం తేరట్‌పల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. చదువుకునే ప్రతి ఒక్కరికి పుస్తకాలతో పాటు కంప్యూటర్లు సైతం అందజేస్తానని అన్నారు. కార్యక్రమంలో తలారి సాయి. మల్లిగా శ్రీశైలం, వెంకటేశం, గిరి సత్తయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌సీ చైర్మన్ షమీమ్ అక్తర్ నియామకంపై హర్షం

కనగల్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణానికి చెందిన జస్టిస్ షమీమ్ అక్తర్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ ఎంపికవడంపై మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ జియావుద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసారు. సామాన్య కుటుంబం నుంచి షమీమ్ అక్తర్ ఎంతో కష్టపడి అంచలంచెలుగా ఎదిగారని కొనియాడారు. షమీమ్ అక్తర్ నల్లగొండ పట్టణం వాసి కావటం జిల్లా వాసులకు ఎంతో గర్వకారణమన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

» చేతికందే ఎత్తులో వైర్లు » వరికోత మిషన్లు, ట్రాక్టర్లకు తగులుతున్న వైనం » సమస్యను పరిష్కరించాలని గ్రామస్థుల డిమాండ్


చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు (ఫైల్)

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. చెయ్యెత్తితే అందేలా ఉన్న వైర్లతో ప్రమాదం పొంచి ఉంది. ఏ రూపంలో ప్రమాదం జరుగుతుందోననే భయంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని విద్యుత్ సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయిపల్లి పాత ఊరు నుంచి జాతీయ రహదారికి వచ్చే మార్గంలో విద్యుత్ లైను వెళ్తుంది. ఈ లైన్ ద్వారా వ్యవసాయ బావులు, వీధి దీపాలకు కరెంటు సరఫరా జరుగుతోంది. కొన్ని నెలలుగా స్తంభాలకు ఉన్న విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో కిందకు వేలాడుతున్నాయి. వరికోతల సమయంతో ఈ దారి గుండా వరి కోత మిషన్లు, ట్రాక్టర్లు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాల్సి ఉంది. కిందకు వేలాడుతున్న వైర్లను కర్రల సాయంతో పైకి ఎత్తుతూ అతి జాగ్రత్తగా వెళ్లాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. వేలాడుతున్న వైర్లతో ప్రమాదం ఏ రూపంలో రానుందోనని భయపడుతున్నారు. కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారిన విద్యుత్ వైర్లను సరిచేయాల్సిన బాధ్యత ట్రాన్స్‌కో సిబ్బందిపై ఉంది.

వైర్లను సవరించాలి



గోపలాయిపల్లి పాత ఊరు నుంచి హైవే వరకు వచ్చే విద్యుత్ లైన్ల తీగలు చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయి. తీగలతో పెద్ద ప్రమాదం జరగకముందే విద్యుత్ సిబ్బంది స్పందించి సమస్యను పరిష్కరించాలి. వినాయక చవితి శోభాయాత్రలో కిందకు వేలాడుతున్న వైర్లను తాకిన శోభాయాత్ర వాహనం అలకంరణ వస్త్రాలకు మంటలు అంటుకున్నాయి. వెంటనే వాటిని ఆర్పివేశాం.
- చంద్రశేఖర్, బీజేపీ యువమోర్చా ఉపాధ్యక్షుడు

సమస్యను పరిష్కరిస్తా



గోపలాయపల్లి గ్రామంలో చేతికందే ఎత్తులో ఉండి ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగల సమస్యను పరిష్కరిస్తా. హెల్పర్ ద్వారా వివరాలు తెలుసుకుని అదనపు విద్యుత్ స్తంభం అవసరమైతే సమస్య పరిష్కరిస్తా.
- కే.చంద్రశేఖర్‌రావు, ట్రాన్స్‌కో ఏఈ

రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయం

● డీఎస్పీ శివరాంరెడ్డి


స్నేహక్లబ్ అధ్యక్షురాలు సరళ, క్లబ్ సభ్యులను అభినందిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్నేహక్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం నల్లగొండ వన్‌టౌన్ పరిధిలో స్నేహక్లబ్ అధ్యక్షురాలు సరళయాస ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంబేద్కర్ స్ఫూర్తితో మానవీయకోణంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రక్తదానంతో ఆపదలో ఉన్నవారికి రక్తం అందుబాటులో ఉంచడం ద్వారా ప్రాణాలు నిలబెట్టవచ్చని సూచించారు. ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. అంబేడ్కర్ ఆశయాల సాధనకు అంద రూ కృషి చేయాలని అన్నారు. ఈ శిబిరంలో 50మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య, స్నేహక్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమిస్తే కఠినచర్యలు : ఎంపీడీవో

గట్టుప్పల్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రోడ్డును ఆక్రమించి అక్రమంగా కట్టడాలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని గట్టుప్పల్ ఎంపీడీవో మాధవరెడ్డి, ఎస్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలో సోమవారం వెల్మకన్నె గ్రామంలో ఆక్రమించి కట్టిన కట్టడాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే అక్రమ కట్టడాలకు తావులేకుండా చూడాలన్నారు. అక్రమ కట్టడాలు ఐదు రోజులలోగా తొలగించకపోతే గ్రామపంచాయతీ ద్వారా నేరుగా తొలగించడంతో పాటు కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ కట్టడాలు నిర్వహించిన వారికి నోటీసులు సైతం జారీ చేస్తామని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చాపల మారయ్య, గోపాల్‌రెడ్డి, పలు పార్టీల నాయకులు రావుల రమేష్, టేకుమట్ల శ్రీరాములు, రావుల ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీపీఎం పాదయాత్ర


పాదయాత్రలో వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న సీపీఎం బృందం

కట్టంగూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరు మండలంలో సమగ్రాభివృద్ధి ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం చేపట్టిన పాదయాత్ర మూడవ రోజు కొనసాగింది. సోమవారం మండలంలోని అయిటిపాముల, అక్కలాయిగూడెం, ర సూల్‌గూడెం, బొల్లేపల్లి, మల్లారం, దున్నెల్లి గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భం గా సీపీఎం పార్టీ నాయకులు గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎండీ అబ్బాస్, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, ఇటికల సురేంద ర్, రామస్వామి, మోహన్, గడగోజు రవీంద్రచారి, ఆంజనేయులు, పాలడుగు నాగార్జున, రామకృష్ణ, రవీందర్, గణేష్, లక్ష్మయ్య, సుజాత, రమేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం

చిట్యాలరూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం బోయగుబ్బలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణపక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. పౌష్టికాహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టిహారాన్ని తీసుకోవాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందుతున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఆర్‌జ సైదమ్మ, జె. నవనీత, ఏఎన్‌ఎం సర్వతి, ఆశా కార్యకర్త ప్రవంతి పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

శాలిగౌరారం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అవనిజ ఫౌండేషన్ చైర్మన్ బట్ట సైదులు అన్నారు. శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ సమీపంలో బాలిశెట్టిగూడెం గ్రామానికి చెందిన బట్ట సైదులు అవనిశ్రీ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బట్ట సత్తమ్మ, బట్ట పెద్ద సైదులు, బట్ట చిన్నసైదులు, అన్నెబోయిన అనిల్, కోనేటి అఖిల్, అంకిరెడ్డి రాజేష్, కుంభం సందీప్, బట్ట అనిల్, బట్ట కిరణ్, బట్ట కరుణాకర్, బట్ట మోహన్, పట్టేటి కృష్ణం రాజు, వేముల భరత్, చిత్తలూరు సంతోష్, సందీప్, వంశీ తదితరులు పాల్గొన్నారు.


నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

గట్టుప్పల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలు తమ ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. సోమవారం గట్టుప్పల్ మండల పరిధిలోని అంతంపేట గ్రామంలోని రైతువేదిక వద్ద అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలని అన్నారు. మండలంలోని సర్వే నెంబర్ 6/ఉ లో నిరుదపేదలకు ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చారని, ఆ భూమికి దగ్గరికి లబ్ధిదారులు పోతే అధికారులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు పేదలకు దక్కేవరకు సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ, అంతంపేట సీపీఎం నాయకులు తెలుసూరి సైదులు, ఈరటి వెంకటయ్య, మాదగోని కోటమ్మ, తండా సత్తమ్మ, చొప్పరి లక్ష్మమ్మ, సురిగి నర్సమ్మ, మల్లయ్య, యాదయ్య, కృష్ణయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

మార్కండేయస్వామి ఆలయానికి శంకుస్థాపన

గట్టుప్పల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గట్టుప్పల్ మండల కేంద్రంలో శివ భక్త మార్కండేయస్వామి నూతన దేవస్థానం నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. పురోహితులతో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. దేవాలయ నిర్మాణానికి సహకరించిన దాతలను ఆయన సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, వజ్రమ్మ దంపతులు, మార్కండయ దేవస్థాన అధ్యక్షుడు అవ్వరి గీతా శ్రీనివాస్, నిర్మాణ కమిటీ గౌరవ అధ్యక్షుడు ఇడం శ్రీనివాస్, అధ్యక్షుడు ఇడం భాస్కర్, జెల్లా షణ్ముకి, నామని జగన్నాధం, ఇడం వెంకటేశం, జెల్లా సూర్యకాంతం, నామని శివరాం, చేరుపల్లి భాస్కర్, దోర్నాల అంజయ్య, నరేందర్, మార్కండేయ దేవస్థానం కార్యవర్గ సభ్యులు, భక్తులు సంఖ్యలో పాల్గొన్నారు.

వడగండ్ల వర్షంతో అపారం నష్టం


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో సౌమ్యశ్రుతి

శాలిగౌరా రం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శా లిగౌరారం మండలం లో ఆదివా రం సా యంత్రం కురిసిన వడగండ్ల వర్షానికి రైతులకు భారీ నష్టం జరిగింది. దాదాపు 1000 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నది. 300 ఎకరాల్లో నిమ్మతోట, 100 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. 3 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. 40 విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు పోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ఇటుకులపహాడ్, ఉట్కూర్ గ్రామంలో రేకుల ఇళ్లు నేలమట్టమయ్యాయి. పెర్కకొండారంలో మంగదుడ్ల బలరాం నిమ్మతోటలో నిమ్మకాయలు రాలిపోయాయి. మండలంలో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయని, 40 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయని విద్యుత్ ఏఈ తెలిపారు.

డీఎంఆర్‌కెఎస్ జోనల్ ఆర్గనైజేషన్ సెక్రటరీగా యాదగిరి

కట్టంగూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘ్ జోనల్ ఆర్గనైజేషన్ సెక్రటరీగా మండలంలోని ఈదులూరు గ్రామానికి చెందిన రైల్వే ఉద్యోగి కురివిల్ల యాదగిరిని డీఎంఆర్‌కెఎస్ జోనల్ ఆర్గనైజేషన్ సెక్రటరీగా ఎన్నుకున్నారు. ఇటీవల నాందేడులో జరిగిన దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘ్ 32వ జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఎన్నుకున్నట్లు యాదగిరి తెలిపారు. ఈ సమావేశంలో నల్లగొండలో పనిచేస్తున్న రైల్వే ఉద్యోగి యాదగిరిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ ఉద్యోగులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

జగాల్‌రెడ్డికి సన్మానం

కనగల్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జాతీయ అవార్డు గ్రహీత సీనియర్ పాత్రికేయుడు సుంకిరెడ్డి జగాల్‌రెడ్డిని దళితుల ఐక్య వేదిక మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కనగల్ ఎక్స్‌రోడ్డులో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పత్రికా రంగంలో రిపోర్టర్‌గా జగాల్‌రెడ్డి రెండున్నర దశాబ్దాలుగా అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తండు సైదులుగౌడ్, నాయకులు కరీంపాష, యాదయ్యగౌడ్, హాఫీజుద్దీన్, నర్సింహ, మారయ్య, కందుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలి


నల్లగొండలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్): భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజా సంఘాల నాయకులు కోరారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ బొర్ర సుధాకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్ ^బోనగిరి దేవేందర్, మైనం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ బొజ్జ వెంకన్న, మాజీ కౌన్సిలర్ గున్‌రెడ్డి యుగంధర్ రెడ్డి, మాతంగి అమర్, బిపంగి యాదయ్య, కందుల లక్ష్మయ్య, పేర్ల అశోక్, వింజమూరు లక్ష్మణ్, బీపంగి కిరణ్, దొడ్డి రమేష్, సతీష్, నాగయ్య, ఖతర్నాక్ పాల్గొన్నారు. నల్లగొండలోని టీడీపీ కార్యాలయంలో నల్గొండ పార్లమెంట్ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు బక్కతోళ్ళ ఇస్తారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దొడ్డికొమరయ్య భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, అవాజ్ జిల్లా కార్యదర్శి సయ్యద్ హాశం, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గాదే నర్సింహా, రవిందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యక్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో ప ఆర్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులుకార్యదర్శి మాదగోని శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లెబోయిన శ్యామ్ సుందర్, జిల్లా నాయకులు పిల్లి రామరాజు, బీపంగి జగ్జీవన్ రామ్, పట్టణ అధ్యక్షులు మిర్యాల వెంకన్న, చింత ముత్యాలరావు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, ఉపాధ్యక్షుడు నర్రా శేఖర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎడ్ల సైదులు, నల్లా నరసింహ, జిల్లా కార్యదర్శులు గేర నరసింహ, నలపరాజు వెంకన్న, పగిళ్ల సైదులు, కొమ్రరాజు సైదులు, మధుసూదన్‌లతోపాటు మండల బాధ్యులు రమణ, శీను, ప్రసాదు, రాంబాబు పాల్గొన్నారు.

● మర్రిగూడ మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు రమావత్ రాజేందర్ నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దంటు జగన్, శంకర్, పందుల రాములుగౌడ్, పిట్టల శ్రీనివాస్, మేతరి యాదయ్య, మాజీ ఎంపీపీలు మెండు మోహన్ రెడ్డి, గండికోట హరికృష్ణ పాల్గొన్నారు.

● నకిరేకల్‌లో వివిధ పార్టీల ఆధ్వర్యంలో వేరు వేరుగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల వీరేశం, మండలి డిప్యూటీ మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మాచర్ల సైదులు మాదిగ, మున్సిపల్ ఛైర్ పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దైద రవీందర్, యేసుపాదం, పాల్గొన్నారు.

● కట్టంగూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల వీరేశం. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మాజీ జడ్పీటీసీలు మాద యాదగిరి, సుంకరబోయి నర్సింహ, మాజీ ఎంపీపీ రెడ్డిపల్లి సాగర్, నాయకులు మేడి ఈదయ్య, మర్రి రాజు ఉన్నారు.

● చిట్యాల, నాంపల్లి మండల కేంద్రాల్లో పలుపార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శాలిగౌరారం భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు శాలిగౌరారంలో ఘనంగా నిర్వహించారు.

● చండూరు మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో బండారు యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోరిమి ఓంకారం, బీజేపీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

● మునుగోడులో నిర్వహించిన కార్యక్రమాల్లో వివిధ పార్టీలు, దళిత, ప్రజాసంఘాల నేతలు నారబోయిన రవిముదిరాజ్, కర్నాటి స్వామియాదవ్‌చ బూడిద లింగయ్యయాదవ్, పాల్వాయి చెన్నారెడ్డి, సురిగి చలపతి, మిర్యాల వెంకన్న, చాపల శ్రీను, భీమనపల్లి సైదులు, గోసుకొండ లింగయ్య, పందుల భాస్కర్, ఆరేళ్ల సైదులు, పెరుమాళ్ల ప్రమోద్‌కుమార్, నరేష్, దుబ్బ వెంకన్న, సైదులు పాల్గొన్నారు.

● చిట్యాల మండలంలో సీఐ నాగరాజు, న్యాయవాది పంతంగి శోభన్‌బాబు, కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాస్, జడల చినమల్లయ్య, ఎద్దులపురి కృష్ణ, బోడ స్వామి, పొన్నం లక్ష్మయ్య, జిట్ట నగేష్, యువజన సంఘాల నాయకులు గుండెబోయిన సైదులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి మండలంలో నిర్వహించిన కార్యక్రమాల్లో కాంగ్రెస్ నేతలు బత్తుల ఊషయ్య, బండ సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, లింగాల రాములు, మాదాసు నర్సింహ్మా, బీఆర్ఎస్ నాయకులు చిరమర్తి యాదయ్య, దుబ్బాక శ్రీధర్, సీపీయం నేతలు చింతపల్లి బయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

● గట్టుప్పల్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎంపీడీవో జూలకంటి మాదవరెడి, సిబ్బంది తాటి శ్రీనివాసులు, చెన్నోజు శమీ బాబు, నకిరేకంటి నర్సింహా, మహ్మద్ షఫీ పాల్గొన్నారు.

● కేతేపల్లి మండలంలోని ఇనుపాముల, భీమారం, కొప్పోలు, తుంగతుర్తి, కాసనగోడు, బండపాలెం గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, కాంగ్రెస్, బీజేపీ మండల అధ్యక్షులు కె.శ్రీనివాసయాదవ్, పి.వెంకట్, సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్ లూర్దుమారయ్య, సీపీఎం, కాంగ్రెస్, బీజేపీ, దళిత సంఘాల నాయకులు ఏళ్ళ అశోక్‌రెడ్డి, మట్టి సాల్మన్, బీరం జాన్‌రెడ్డి, పి.శౌరయ్య, ఎన్.మంగమ్మ, జె.ముత్తమ్మ, ఎ.అనిత పాల్గొన్నారు.

● కనగల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఐక్యవేదిక అధ్యక్షుడు లింగయ్య, మాజీ జడ్పీటీసీలు నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, ఎర్రోల సంజీవ, సైదులుగౌడ్, మాజీ ఎంపీపీ కరీంపాష, కాంగ్రెస్ పార్టీ మండలధ్యక్షుడు అనూప్‌రెడ్డి, ఆర్‌టీఏ మెంబర్ రాజురెడ్డి, బీఆర్ఎస్ మండలధ్యక్షుడు యాదయ్యగౌడ్, పీఏసీఎస్ ఛైర్మన్లు సహదేవరెడ్డి, శ్రీనివాస్ ఎంపీడీఓ జయరాం మాజీ సర్పంచ్‌ు రాంబాబు, యాదయ్య పాల్గొన్నారు.

● మునుగోడు మండలం చల్మడ గ్రామంలో కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు వేమిరెడ్డి జితేందర్ రెడ్డి పోగుల ప్రకాష్, సంఘం నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

● మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి



వాల్ రైటింగ్‌పై కలర్ వేస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ సందర్భంగా ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బహిరంగ సభ ను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో బహిరంగ సభకు సంబంధించి వాల్ రైటింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25ఏళ్ల ఈ పండుగకు ఊరువాడ కదిలి రావాలన్నారు. నల్లగొండ నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు రైతులు, మహిళలు వరంగల్‌కు వచ్చి విజయవంతం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. ఇప్పటి వరకు రైతుభరోసా వేయలేదని, రైతు రుణమాఫీ సైతం పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. ఆరు గ్యారంటీల పేరిట అ ధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఇవ్వక పోవడంతో కళాశాల యజమాన్యాలు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ పార్టీ దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మందడి సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్, అభిమన్యు శ్రీనివాస్, రావుల శ్రీనివాస్ రెడ్డి, గణేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి


సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

నల్లగొండరూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లను రద్దు చేసి, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డితో పాటు కార్మిక సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్మిక సంఘాల సంయుక్త సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, ఏఐటీయుసీ జిల్లా ఉపాధ్యక్షుడు సైదిరెడ్డి, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గుర్రం వెంకట్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకిశాల వెంకన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బొంగురాల నర్సింహలతో సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను మార్పు చేసి, 4 లేబర్ కోడలను కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ దేవ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెడుతుందని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న దేశ వ్యాప్తంగా సంఘటిత రంగాల కార్మికులంతా సమ్మెలో పాల్గొననున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెకు మద్దతుగా జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో ఏప్రిల్ 19న ఉదయం 10 గంటలకు సమ్మె సన్నాహక సదస్సు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశానికి అన్ని కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఎండి సలీం, బాణాల పరిపూర్ణచారి, బోడ ఇస్తారి, ఎన్నామల్ల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

● ఘనంగా శ్రీ రాఘవేంద్ర హోటల్ ప్రారంభం


హోటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ రాఘవేంద్ర హోటల్‌ను సోమవారం ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతాప్రమాణాలను పాటిస్తూ అన్ని రకాల రుచులను అందిస్తూ ప్రజల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, ఆలకుంట్ల నాగరత్నంరాజు, రాఘవేంద్ర ప్రాంచెస్ నందకిషోర్, ప్రొపెయిటర్ దుగ్యాల సృజన్‌కుమార్, బొడ్డు శంకర్ తదితరులు పాల్గొన్నారు.


భక్తిభావాన్ని ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలి

● ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

మర్రిగూడ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవరుచుకోవాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వారు పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు వేంకటేశ్వరస్వామి రథోత్సవం సందర్భంగా పూజలు నిర్వహించారు. నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిలను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనర్సింహ, సురేష్, మల్లేష్, సత్యానారాయణ, కృష్ణ, జగన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాజు, శేఖర్, పాండురంగారావు, జానయ్య పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు అండగా ప్రభుత్వం

నకిరేకల్, ఏప్రిల్ 14, (ఆంధ్రజ్యోతి): అకాల వర్షానికి నష్టపోయిన నిమ్మ రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఆరు గ్యారెంటీల మేనిఫెస్టో సభ్యుడు చామల శ్రీనివాస్ అన్నారు. రైతులు అధైర్య పడవద్దని మనోధైర్యం అన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదేశానుసారం కాంగ్రెస్ నాయకులు సోమవారం నకిరేకల్ మండలంలోని టేకులగూడెం గ్రామంలో నిమ్మతోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా చామల శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు అధైర్య పడవద్దని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకునేందుకు ముందుంటుందని అన్నారు. మాజీ ఎంపీపీ లింగాల వెంకన్న, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాస కర్ణాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నకిరేకంటి యేసుపాదం, బ్రహ్మదేవర రమేష్ పాల్గొన్నారు.



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.138	225	245
సూర్యాపేట	రూ.150	210	240
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.0 । కనిష్ఠం 24.4

ఏటీసీలతో ఉపాధికి భరోసా!

టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్)తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీ) రానున్న విద్యాసంవత్సరం నుంచే అందుబాటులోకి రానున్నాయి. విద్యార్థులకు తక్షణ ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడం లక్ష్యంగా చేపట్టిన ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వ ఐటీఐ (ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్)లలో ఈ ఏటీసీలను ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నల్లగొండ (బాయ్స్), నల్లగొండ (గర్ల్స్) ఐటీఐలతో పాటు,అనుముల,డిండి, హుజూర్‌నగర్, ఆలేరు, భువనగిరిలోని ఐటీఐలలో వీటిని నిర్మిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

ఉమ్మడి జిల్లాలో ఏటీసీలకు సంబంధించి ఇప్పటికే భవనాల నిర్మాణాలు దాదాపు పూర్తికాగా, ల్యాబ్‌లు, కంప్యూటర్లు, వర్క్‌షాపులు, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ, ఇతర సామగ్రి, బోధనోపకరణాలు, ఇతర పనులు వేగవంతంగా సాగుతున్నాయి. నల్లగొండలోని బాయ్స్ ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన ఏటీసీని ఈ నెలలో ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా 65 ఏటీసీలను నెలకొల్పుతుండగా, మే నెలాఖరు నాటికి అన్ని ఏటీసీలు సిద్ధమవుతాయని, వచ్చే విద్యాసంవత్సరం నుంచి వీటిలో అడ్మిషన్లు ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నా రు. ప్రతి ఏటీసీలో ఆరు ఆధునిక కోర్సులను ప్రవేశపెడుతున్నారు. ఈ కోర్సుల్లో శిక్షణ పూర్తయ్యాక టీటీఎల్ సహా అరబ్ దేశాలు, దేశీయ ఐటీ,సాఫ్ట్‌వేర్,హార్డ్‌వేర్ కంపెనీల్లో తక్షణం ఉద్యోగ అవకాశాలు కల్పించే..

- మిగతా 6వ పేజీలో...



నల్లగొండలోనిర్మాణం పూర్తయిన ఏటీసీ

- ఉమ్మడి జిల్లాలో ఏడు ఐటీఐలలో ఏర్పాటు
- పదేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు తీసుకున్న టాటా టెక్నాలజీ లిమిటెడ్
- ఇంటర్‌స్థాయిలోనే విద్యార్థులకు తక్షణ ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఛాన్స్
- ఏటీసీలలో ఆరురకాల ఆధునిక కోర్సులు

ఉమ్మడి జిల్లాలోని ఏటీసీలలో ప్రవేశపెట్టే కోర్సులు ఇలా..

కోర్సు	కాలవ్యవధి	ఒక్కో కేంద్రంలో సీట్ల సంఖ్య
అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్	రెండేళ్లు	24
ఆర్టిఫిషియన్ యూసింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్	ఏడాది	10
బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్(మెకానికల్)	రెండేళ్లు	24
ఇండస్ట్రియల్ రోబోటిక్స్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్	ఏడాది	20
ఎలక్ట్రికల్ వెహికిల్ మెకానిక్	రెండేళ్లు	24
మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్	ఏడాది	20

ఏటీసీల నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయి..



ఉమ్మడి జిల్లాలో ఏడు ప్రభుత్వ ఐటీఐల వద్ద నిర్మిస్తున్న ఏటీసీ భవనాల పనులు దాదాపు పూర్తయ్యాయి. వాటిల్లో ఏర్పాటు చేయాల్సిన సామగ్రి కూడా ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది. నల్లగొండలో బాయ్స్ కళాశాల వద్ద ఏర్పాటు చేస్తున్న ఏటీసీ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. మిగిలిన ఆరు ఏటీసీలలో కూడా నిర్మాణాలు దాదాపు చివరిదశకు వచ్చాయి. అన్నింటిలోనూ 2005-26 విద్యాసంవత్సరం నుంచి తరగతులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇక్కడ నిర్వహించే కోర్సులు ఆధునిక ప్రపంచంలో తక్షణం ఉపాధి, ఉద్యోగం పొందేందుకు విద్యార్థులకు ఉపయోగపడుతుంది. ఇంటర్ స్థాయిలోనే విద్యార్థులు ఉద్యోగం, ఉపాధి పొందేందుకు ఇవి దోహదపడతాయి.

- నరసింహచారి, ఉమ్మడి జిల్లా ఐటీసీల కన్వీనర్

వైభవంగా గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణను ప్రారంభిస్తున్న ఈవో భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట ఆలయంలో సోమవారం గిరిప్రదక్షిణ వైభవంగా సాగింది. కొండకింద వైకుంఠ ద్వారం చెంత గిరిప్రదక్షిణను ప్రారంభించారు. కాగా, వరుస సెలవులు కావడంతో సుమారు 20వేల మంది భక్తులు సామూహిక గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. •7లో..

నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో యూడైస్ సర్వే

ఏకీకృత జిల్లా పాఠశాలల విద్యా సమాచారం (యూడైస్)లో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నమోదు చేసిన వివరాలపై నేటి నుంచి థర్డ్ పార్టీ సర్వే ప్రారంభం కానుంది. ఇప్పటి వరకు విద్యా సంవత్సరంలో యూడైస్ నమోదు పూర్తయ్యాక కేవలం 5శాతం పాఠశాలల్లో క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ (సీఆర్‌పీ) మాత్రమే తనిఖీలు చేసేవారు. కానీ యూడైస్‌లో నమోదు చేస్తున్న విద్యార్థుల సంఖ్య, పాఠశాలలో వసతుల వివరాలపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో వాస్తవాలపై ప్రభుత్వం దృష్టిని సారించింది. దీంతో ఈనెల 15నుంచి 21వ తేదీ వరకు పాఠశాలల వారీగా డీఈడీ, బీఈడీ విద్యార్థులు యూడైస్ వివరాల ఆధారంగా సర్వే నిర్వహించనున్నారు. ఈ మేరకు సర్వేలో పాల్గొనే విద్యార్థులకు అవగాహన, శిక్షణ తరగతులు ఇప్పటికే పూర్తయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని సుమారు 2,800 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ సర్వే సాగనుంది. అయితే విద్యాశాఖలో థర్డ్ పార్టీ సర్వే ఇదే ప్రథమం కావడం గమనార్హం.

- (ఆంధ్రజ్యోతి,భువనగిరి టౌన్)



- థర్డ్ పార్టీ ద్వారా నిర్వహణ
- విద్యార్థుల సంఖ్యపై తేలనున్న వాస్తవాలు
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 2,800 పాఠశాలలు
- 250 మంది డీఈడీ, బీఈడీ విద్యార్థుల ద్వారా సర్వే

యూడైస్ నమోదు వివరాల ఆధారంగానే పాఠశాలలకు ప్రభుత్వం గ్రాంట్స్ మంజూరు చేస్తుంది. వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తుంది. దీంతో పాఠశాల విద్యలో యూడైస్ అత్యంత కీలకం. పాఠశాల వివరాలతో పాటు విద్యార్థి సమగ్ర వివరాలు కూడా యూడైస్‌లో నమోదు చేస్తారు. ఈ మేరకు 2024-25 విద్యాసంవత్సరంలో నమోదైన వివరాలపై థర్డ్ పార్టీ సర్వే జరగనుంది. ఆయా పాఠశాలల్లో తరగతుల వారీగా చదువుతున్న విద్యార్థులు, ఆధార్ అనుసంధానం, తరగతి గదులు, మూత్రశాలలు, తాగు నీరు, పాఠశాల భవనం, క్రీడా స్థలం, ఫర్నిచర్, ల్యాబ్, విద్యార్థుల యూనిఫాం, పాఠ్యపుస్తకాల సరఫరా, ప్రస్తుత విద్యాసంవత్సరంలో నూతన ప్రవేశాలు, డ్రాపౌట్స్, మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయులు, ఖాళీలు తదితర సమగ్ర వివరాలను యూడైస్‌తో సరిపోల్చుతారు. పాఠశాల, తరగతుల వారీగా కావాల్సిన సదుపాయాలు, అవసరాలను గుర్తించనున్నారు. అలాగే యూడైస్‌లో నమోదు చేసిన వివరాల తప్పొప్పులను సర్వే సభ్యులు ధ్రువీకరించనున్నారు.దీంతో విద్యాశాఖలో ఈథర్డ్‌పార్టీ సర్వే అత్యంత కీలకమైనదని అధికారులు పేర్కొంటున్నారు.

ఒక్కొక్కరు పది పాఠశాలలు...

థర్డ్ పార్టీ సర్వే బాధ్యతను విద్యాశాఖ డీఈడీ, బీఈడీ విద్యార్థులకు అప్పగించింది. ప్రభుత్వ...

- మిగతా 6వ పేజీలో...

ఏర్పాట్లు పూర్తి చేశాం



యూడైస్ థర్డ్ పార్టీ సర్వే కోసం ఏర్పాట్లు పూర్తి చేశాం. సర్వే బృందాలకు పాఠశాలలను కేటాయించాం. అయితే యూడైస్‌లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నమోదు చేసిన వివరాలు సమగ్రంగానే ఉంటాయని భావిస్తున్నాం. థర్డ్ పార్టీ సర్వేతో పాఠశాలలకు ప్రయోజనం చేకూరనుంది.

- కె.సత్యనారాయణ, యాదాద్రి డీఈవో

జానారెడ్డిపై అసత్యప్రచారం

- ఆయన లేఖతో రాజగోపాల్‌రెడ్డికి మంత్రిపదవి రాలేదనడం సరికాదు
- ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్



నల్లగొండ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): మాజీ మంత్రి జానారెడ్డి ఏఐసీసీకి రాసిన లేఖ వల్లే ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి మంత్రిపదవి రాకుండా ఆగిందనడం అసత్య ప్రచారమని, మంత్రి పదవి ఇవ్వవద్దని జానారెడ్డి ఎక్కడా, ఎవరికీ చెప్పలేదని, ఏ లేఖలోనూ రాయలేదని ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు కేతావత్‌శంకర్‌నాయక్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన నల్లగొండలో మీడియాతో మాట్లాడారు. జానారెడ్డి ఎవరి పదవులకూ అడ్డుపడేవ్యక్తి కాదని, రాజగోపాల్‌రెడ్డికి అధిష్ఠానం మంత్రిగా అవకాశం కల్పిస్తే సంతోషపడే వ్యక్తి అన్నారు. అధిష్ఠానం రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే జానారెడ్డిగానీ, పీసీసీ అధ్యక్షుడుగానీ, తాను గానీ ఎవరూ అడ్డుచెప్పరన్నారు. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం లేనందున, అక్కడి ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీమంత్రులు జానారెడ్డివద్దకు వచ్చి గ్రేటర్ హైద్రాబాద్ పరిధిలో మంత్రి పదవి అవసరమని,రానున్న గ్రేటర్ ఎన్నికలు, అభివృద్ధి కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని అధిష్ఠానానికి తెలియజేయాలని కోరారన్నారు. ఆ రెండు జిల్లాలకు క్యాబినెట్‌లో అవకాశం కల్పించాలని కోరుతూ జానారెడ్డి లేఖ రాశారని వివరించారు. ధర్మరాజులా పార్టీకి జానారెడ్డి మార్గనిర్దేశం చేస్తున్నారని తెలిపారు. రాజగోపాల్‌రెడ్డికి మంత్రిపదవి ఇస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చిన విషయంపై స్పందిస్తూ, ఆ అంశం రాజగోపాల్‌రెడ్డికి, అధిష్ఠానానికి మాత్రమే సంబంధమని, తన పరిధికి మించిన అంశమని, తాను వ్యాఖ్యానించలేనని తెలిపారు. అధిష్ఠానం మాట ఇస్తే తప్పకుండా నెరవేరుస్తుందని స్పష్టం చేశారు.

అంబేడ్కర్ రాజ్యాంగంతోనే సమాన హక్కులు

కలెక్టర్ ఇలా త్రిపాఠి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్లే సమాజంలో ప్రతీ ఒక్కరు హక్కులు, బాధ్యతలు, పదవులను పొందగలుగుతున్నారని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా మర్రిగూడ బైపాస్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డీఈవో కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంబేడ్కర్ రాజ్యాంగంలో రూపొందించిన ఆర్టికల్స్ వల్లే తాను ఐఏఎస్ కాగలిగానని, భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్ కావాలనుకునే విద్యార్థులకు ఆయన రాజ్యాంగమే స్ఫూర్తి అని అన్నారు. సమాన విద్య, సమానత్వ హక్కులు,ప్రాథమిక హక్కులన్నీ రాజ్యాంగం ద్వారా సంక్రమించాయన్నారు. అంబేడ్కర్ జయంతి రోజున రాష్ట్ర ప్రభుత్వం భూభారతి పోర్టల్‌ను అమలులోకి తెచ్చిందన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ చదువును ఆయుధంగా తీసుకొని సామాజిక మార్పును తీసుకొచ్చిన మహానుభావుడు డాక్టర్ అంబేడ్కర్ అని కొనియాడారు. ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, నెల్లికంటి సత్యం మాట్లాడుతూ, అణగారిన వర్గాల కోసం హక్కులు, చట్టాలను రూపొందించిన మహనీయుడు అంబేడ్కర్ అని అన్నారు. ఆయన స్ఫూర్తిగా సమానత్వం కోసం ప్రజాతంత్ర శక్తులంతా కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, అదనపు ఎస్పీ రమేష్, సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్, జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్‌రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, బీసీ సంఘం, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్సీలు భారత రాజ్యాంగ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

• కలెక్టర్లతో సీఎం సమీక్ష



హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో కలెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చలేక ప్రభుత్వం అభాసుపాలు

మాజీమంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

సూర్యాపేట(కలెక్టరేట్), హుజూర్‌నగర్, ఏప్రిల్ 14,(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక కాంగ్రెస్ ప్రభుత్వం అభాసుపాలైందని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు.వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం కోసం సోమవారం జిల్లాకేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుబంధు, రైతు బీమా, రైతు భరోసా ఇవ్వకపోగా, రుణమాఫీ పూర్తిగా చేయలేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ఆసరా పింఛన్లు పెంచకపోగా ఉన్న పింఛన్లు సమయానికి ఇవ్వడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకుల మాయ మాటలకు మోసపోయిన ప్రజలు నేడు గోసపడుతున్నారన్నారు. ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే సభ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఆత్మకూర్(ఎస్) మండలం మంగళి తండాతో పాటు పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, రాష్ట్ర నాయకులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, వై.వెంకటేశ్వర్లు, నాయకులు గోపగాని వెంకటనారాయణగౌడ్, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, పెరుమాళ్ల అన్నపూర్ణ, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, పుట్టా కిశోర్‌కుమార్, మొరిశెట్టి శ్రీనివాసులు, సవరాల సత్యనారాయణ, బూర బాలసైదులుగౌడ్, కొణతం సత్యనారాయణరెడ్డి, నెమ్మాది భిక్షం, తూడి నర్సింహారావు పాల్గొన్నారు. కాగా, బీఆర్ఎస్ సభ విజయవంతం కావాలని విశ్రాంత ఉద్యోగి నర్సింహాచారి జగదీష్‌రెడ్డికి రూ.1016లను చెక్కు ద్వారా విరాళం అందజేశారు.

హుజూర్‌నగర్‌లో ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి సభకు జిల్లాలోని ఒక్కొక్క మిల్లు నుండి కోటి రూపాయల చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మిల్లర్లతో కుమ్మక్కైందని, అందుకే బస్తా ధాన్యం ధర రూ.1200లు, 1500లు అంటున్నారని విమర్శించారు. మిల్లర్లు, ప్రభుత్వం కుమ్మక్కు అవటంతో కనీస మద్దతు ధర 2,320, బోనస్ 500 కలిపి 2,820 రావల్సి ఉండగా, తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. హుజూర్‌నగర్ నుండే కాంగ్రెస్ పార్టీ ఖాళీ అవుతుందన్నారు.

నీళ్లు, నియామకాల్లో మోసం చేసిన కాంగ్రెస్

బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్



రాయగిరి నుంచి పాదయాత్రగా వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 14, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ నీళ్లు, నియామకాల విషయంలో ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. యాదాద్రి జిల్లా గుట్టలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి లక్షల ఎకరాలకు సాగునీరు అందించి ఎంతో మంది రైతులను ఆదుకుంటే సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరాన్ని పండబెట్టి రైతుల భూములను ఎండబెట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ ఇచ్చిన నోటిఫికేషన్లతోనే ఉద్యోగాలు భర్తీ చేశారే తప్ప, కొత్తగా ఇచ్చిందేమీలేదని, నిరుద్యోగుల గురించి మాట్లాడే నైతిక హక్కు ఆయనకు లేదన్నారు. విద్యార్థులకు రూ.5లక్షల రుణాలు ఇస్తానని, విద్యార్థినులకు ద్విచక్రవాహనాలు ఇస్తానని ఇప్పటి వరకు అందజేయలేదన్నారు. వీటన్నింటినీ ప్రశ్నించేందుకే వరంగల్‌లో రజతోత్సవ సభకు విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం బీఆర్ఎస్వీ రాష్ట్ర నేత తుంగబాలు మాట్లాడుతూ రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు రాయగిరి నుంచి గుట్ట స్వామి వారి పాదాల వరకు వెయ్యి మంది విద్యార్థులతో పాదయాత్ర నిర్వహించామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, బొగ్గు శివకుమార్, రమేష్ యాదవ్, భాను, మున్నా, ఎండీ.అజ్జు, మన్నె ప్రభాకర్, పాల్గొన్నారు.

బహిరంగ సభ విజయవంతం చేయాలి

భువనగిరి రూరల్, యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు.

సోమవారం బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్‌తో కలిసి భువనగిరి శివారులోని రాయగిరి నుంచి వడాయిగూడెం మీదుగా యాదగిరిగుట్ట వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నార్మాక్స్ డైరెక్టర్ కస్తూరి పాండు, నాయకులు ఒగ్గు శివకుమార్, పెంట నితీష్, మట్ట ధనుంజయ, కల్లూరి రామచంద్రారెడ్డి, ప్రవీణ్ రెడ్డి, కల్లూరి రాంచంద్రారెడ్డి, కర్రె వెంకటయ్య, కసావు శ్రీనివాస్‌గౌడ్, మిట్ట వెంకటయ్య గౌడ్, పాపట్ల నరహరి, తదితరులు పాల్గొన్నారు.

సిరులు కురిపిస్తాయని సాగుచేస్తే..

- పంట చేతికి వచ్చినా దిగుబడి తగ్గిన సన్న రకం ధాన్యం
- తాలు పోయి.. తూకాల్లేక దిగాలు
- ఇదీ సాగర్ ఆయకట్టు అన్నదాత పరిస్థితి

•6లో..



అటవీ భూముల్లో చెలరేగిన మంటలు

- మంటలను అదుపుచేసిన అగ్నిమాపక సిబ్బంది
- అడవిదేవులపల్లి మండలంలో ఘటన

•6లో..

స్పీడ్ బ్రేకర్స్ తొలగింపు

చింతపల్లి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని గొడుకొండ్ల రిజర్వాయిర్ (హైవే సమీపంలో) స్వలాభం కోసం ఆదివారం రోడ్డుకు అడ్డుగా స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేశారు. గొడకొండ్ల గ్రామానికి చెందిన కొంతమంది యువకులు జోక్యం చేసుకొని సోమవారం ఎక్స్‌కవేటర్‌తో అడ్డు కట్టలను తొలగించారు. రోడ్డుకు అడ్డుకట్టలు వేయడం వల్ల రెండుకార్లు, ఆటో ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి.

యువ వికాసానికి 1109 దరఖాస్తులు

నిడమనూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకానికి మండలంలో దరఖాస్తులు పోటెత్తాయి. దరఖాస్తుల ప్రక్రియ సోమవారం ముగిసింది. పథకం కోసం మండలంలో అభ్యర్థులు భారీగా దరఖాస్తు చేసుకున్నారు. ఒక్క చివరి రోజే 447 మంది దరఖాస్తులు చేసుకున్నారు. రాజీవ్ యువ వికాసం కోసం మండలంలో మొత్తం 1109 దరఖాస్తులు వచ్చినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో బోనగిరి రమేష్ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలి



దేవాలయంలో పూజలు చేసి మాట్లాడుతున్న రవికుమార్, సుధాకర్

దేవరకొండ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తూటుపల్లి రవికుమార్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో గావ్ చలో, బస్తీ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం దేవరకొండ పట్టణశాఖ ఆధ్వర్యంలో ముత్యాలమ్మ దేవాలయంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రేషన్‌షాపును స్థానిక నాయకులతో కలిసి సందర్శించి మాట్లాడారు. ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్‌యోజన పథకంలో భాగంగా సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్న రేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేపట్టిన సన్నబియ్యం పంపిణీతో పేదవాడి కుటుంబం ఆనందంగా ఉందన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా పేద, బడుగు, బలహీనవర్గాలకు లబ్ధి చేకూరే విధంగా ఉచిత బియ్యంతో పాటు అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. కేంద్రప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వస్కుల సుధాకర్, నాయకులు కర్నాటి సురేష్, బెజవాడ శేఖర్, జల్దా భాస్కర్, సహదేవ్, అజయ్, శంకరయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత సుమిత్రమ్మ మృతి బాధాకరం



సుమిత్రమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్, నర్సింహారెడ్డి, వేణుధర్‌రెడ్డి

దేవరకొండ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ప్రముఖ న్యాయవాది, దేవరకొండ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దివంగత నెమికంటి సోమన్న భార్య నెమికంటి సుమిత్రమ్మ మృతి బాధాకరమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం దేవరకొండలో అనారోగ్యంతో మృతి చెందిన నెమికంటి సుమిత్రమ్మ మృతదేహానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, డాక్టర్ వేణుధర్‌రెడ్డిలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. దివంగత మాజీ ప్రధాని నర్సింహారావు కుటుంబానికి నెమికంటి సోమన్న కుటుంబానికి మంచి స్నేహపూర్వక సంబంధాలు ఉండేవని గుర్తు చేశారు. సుమిత్రమ్మ కుమారులు న్యాయవాదులు నెమికంటి గౌరిశంకర్, రమాశంకర్, ఉమశంకర్, శంకర్‌తో పాటు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యేతో పాటు నాయకులు పరామర్శించి ఓదార్చారు.


అయ్యప్పకు వైభవంగా పంచామృతాభిషేకాలు



అయ్యప్పస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

హాలియా, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): హాలియా మునిసిపాలిటీలోని రామాలయంలో శబరిగిరి అయ్యప్పస్వామి జయంతి సందర్భంగా పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు రామాలయంలో అయ్యప్పస్వామి విగ్రహానికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో పానుగంటి మల్లయ్య గురుస్వామి, అనంతయ్య, భీష్మాచారి, రమణారెడ్డి, తాళ్లపాక బాలకృష్ణ, చారి, దుర్గారావు, భవాని, పొదిల సైదులు, కిలారి దుర్గాప్రసాద్, శ్రీను, సబ్బు, నరేష్, మల్లిఖార్జున్, వెంకటేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేస్తున్న నాయకులు

హాలియా, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా హాలియా మునిసిపాలిటీ ఇబ్రహీంపేట గ్రామంలో సామాజిక కార్యకర్త లింగాల ప్రభాకర్ ఆధ్వర్యంలో చదువుకునే విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అక్బర్‌ఖాన్, అంజద్‌ఖాన్, లింగాల యశ్వంత్, ఈగల కొండలు, కందుల గోపి, ఆడెపు సైదులు, కందుల శివ, అనుముల సాయి, సైదులు, హుస్సేన్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు కార్మికులు సిద్ధం కావాలి

పెద్దవూర, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై మే 20వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మికవర్గం సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేంద్రప్రభుత్వం అన్ని రంగాల్లోని కార్మికులను ఇబ్బందులకు గురిచేసేలా చట్టాలు చేస్తోందని ఆరోపించారు. మే 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌కె.బషీర్, దుబ్బ రామచంద్రయ్య, దుర్గయ్య, పరమేష్, వెంకటమ్మ, జయమ్మ, దుబ్బ కృష్ణ, ప్రభాకర్, రాజారావు, వెంకన్న, బగ్గనాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చినపాక లక్ష్మీనారాయణ

ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థికాభివృద్ధి



ఘనపుం ఎక్స్‌రోడ్డు వద్ద సాగుచేసిన ఆయిల్‌ఫామ్ తోట

రాయితీతో సాగు... లాభాలు బాగు
మండలంలో పెరుగుతున్న సాగు విస్తీర్ణం

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చు. అటవీ జంతువులు, కోతుల బెడద ఉండదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సాగుకు అధిక ప్రాధాన్యమిస్తున్నాయి. సాగు విస్తీర్ణం పెంచేందుకు 60 - 40నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించి రైతులకు ప్రోత్సాహకాలు, రాయితీలు అందజేస్తున్నాయి. మార్కెట్‌లో ఒక్కో మొక్క ధర రూ.193 వరకు ఉండగా ప్రభుత్వం రైతులకు కేవలం రూ.20కే అందిస్తోంది. ఎకరానికి 57 మొక్కల చొప్పున ఇస్తోంది. ఆ భూమిలో అంతర పంటల సాగుకు, దున్నకాలు, ఎరువులకు ఏడాదికి రూ.4200 చొప్పున వరుసగా నాలుగేళ్ల పాటు రాయితీ అందిస్తోంది. సన్న, చిన్నకారు రైతులకు మొక్కలు నాటేందుకు, గుంతలు తవ్వడం, మొక్కలు నాటడం వంటి పనులు అదనంగా వర్తిస్తాయి.

900 ఎకరాల్లో..

దేవరకొండ డివిజన్ పరిధిలో 900 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటేందుకు 2024-25 సంవత్సరానికి లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటి వరకు 820 ఎకరాల్లో పంట వేశారు. నల్లగొండ జిల్లాలోనే అత్యధిక ఆయిల్‌పాం పంటలో మొదటిస్థానంలో ఉంది.

ప్రోత్సాహకాలు ఇలా

ఆయిల్‌పాం సాగుచేసే రైతులకు 90 శాతం రాయితీతో ప్రభుత్వమే మొక్కలు అందజేస్తుంది. 5 ఎకరాలలోపు భూమి ఉన్న రైతులకు బిందు సేద్యంపై సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం, సాధారణ రైతుకు 80 శాతం, ఎస్సీఎస్టీలకు 100 శాతం రాయితీపై పరికరాలు అందజేయనున్నారు. అంతర పంటలను సాగు చేసేందుకు అవకాశం ఉంది.

అన్ని విధాలా సహకరిస్తాం



ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు అన్ని విధాలా సహకరిస్తాం. తరుచూ తోటలను సందర్శించి సలహాలు, సూచనలు ఇస్తున్నాం. ఆయిల్‌పామ్‌లో ఎలాంటి అంతర పంటలు సాగు చేయాలో వివరిస్తున్నాం. అంతర పంటల సాగుతో రైతులు అదనపు ఆదాయం పొందవచ్చు. మార్కెట్ కూడా అందుబాటులో ఉంటుంది. దీంతో దళారులను ఆశ్రయించాల్సిన అవసరం లేదు.

- రవి నాయక్, డివిజన్ ఉద్యానవన అధికారి, దేవరకొండ

దేవకొండ డివిజన్‌లో ఇప్పటి వరకు మండలాల వారీగా ఆయిల్‌ఫామ్ సాగు వివరాలు..
దేవకొండ- 300
కొండమల్లేపల్లి-150
చింతపల్లి-700
పీఏపల్లి, గుడిపల్లి-400
డిండి-400
చందంపేట-150
నేరేడిగొమ్ము-100

ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువ

గతంలో బత్తాయి, వేరుశనగ, ఇతర పండ్ల తోటలను సాగు చేసిన రైతులు ఆయిల్‌పామ్ తోటలను ఏర్పాటుకు ఉత్సాహం చూపిస్తున్నారు. ఖచ్చితంగా నీటి వసతులు ఉన్న బోరు, బావి వ్యవసాయ క్షేత్రాల్లో ఆయిల్‌ఫాం తోటలు సాగు చేస్తే ఎక్కువ లాభాలు పొందవచ్చని ఉద్యానవన అధికారులు తెలిపారు. ఆయిల్‌ఫాం తోటలకు చీడపీడలు సోకే ఆస్కారం తక్కువ. మొక్కలు నాటిన నాలుగేళ్ల అనంతరం ఏటా ఎకరానికి 8 నుంచి 12 టన్నుల ఆయిల్‌పామ్ కాయల దిగుబడి వస్తుందన్నారు. ఒక్కసారి మొక్కలు నాటితే పంట మొదలైనప్పటి నుంచి 30 ఏళ్ల పాటు రైతు దిగుబడి పొందవచ్చు. కేవలం నీరు పెట్టి ఎరువులు వేస్తే సరిపోతుంది. పంట మార్కెట్‌కు తరలించాలన్న దిగులు అవసరం లేకుండానే కంపెనీ వారే పంటను కొనుగోలు చేస్తారని అధికారులు పేర్కొంటున్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



దామరచర్లలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్ఆర్

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఆధునిక భారత రాజ్యాంగ నిర్మాత, ప్రజాస్వామిక స్వాప్నికుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం చేసిన కృషి మరువలేనిదని, ఆయన ఆశయసాధనకు కృషి చేయాలని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, నేనావత్ బాలునాయక్ అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని సోమవారం జిల్లాలోని మిర్యాలగూడ, దేవరకొండలో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఘనంగా నివాళులర్పించారు. వివిధ పార్టీల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా భారతదేశ ఔన్నత్యాన్ని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత వ్యక్తి, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అని తెలిపారు. తీవ్ర పేదరికాన్ని అనుభవిస్తూ అంబేడ్కర్ దీపపు వెలుగుల్లో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదిగారని అన్నారు. అడుగడునా అవమానాలు, అసమానత, వివక్షతను ఎదుర్కొన్నారని అన్నారు. కొలంబియా యూనివర్సిటీలో రాజనీతి శాస్త్రాన్ని అధ్యయనం చేశారని అన్నారు. ప్రపంచ రాజ్యాంగాలను చదివి దేశ మూలవాసుల హక్కుల, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వెల్లివిరిసేలా భారత రాజ్యాంగాన్ని రచించారని అన్నారు. కార్యక్రమంలో స్కైలాబ్‌నాయక్, పొదిల శ్రీనివాస్ పాల్గొన్నారు, దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో రామచంద్రగూడెం వై జంక్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల వివక్ష లేని సమాజం కోసం అంబేడ్కర్ కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో వస్కుల మట్టయ్య, ముండలగిరి కాంతయ్య, తలకొప్పుల సైదులు, మచ్చ కొండల్, లింగ య్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ, కులగణన, బీసీ రిజర్వేషన్ల పెంపు వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. అంబేడ్కర్ జయంతి రోజునే ఎస్సీ వర్గీకరణ కల సంపూర్ణంగా నెరవేరుతుండడం సంతోషంగా ఉందన్నారు. అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, ఎంపీడీవో డానియెల్, సిరాజ్‌ఖాన్, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, ఆలంపల్లి నర్సింహ, వెంకటయ్యగౌడ్, వెంకటేష్‌గౌడ్, ఏటీడబ్ల్యూవో కరుణశ్రీ, వెంకటేష్, యూనుస్, వెంకటయ్య, రాజరావు, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు. సీపీఐ కార్యాలయంలో పల్లా నర్సింహారెడ్డి, సీపీఎం కార్యాలయంలో సీపీఎం నేత నల్ల వెంటయ్య, బిజిలి లింగయ్య, బీజేపీ కార్యాలయంలో వస్కుల సుదాకర్, మునిసిపాలిటీలో కమిషనర్ సుదర్శన్, వివిధ ప్రభుత్వ కార్యాలయాల అధికారులు అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గాజుల ఆంజనేయులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కొండమల్లేపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే బాలునాయక్‌తోపాటు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్‌వీ కాంప్లెక్స్‌లో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పా టు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఉటుకూరి వేమన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ వేణుధర్‌రెడ్డి, సిరాజ్‌ఖాన్, వెంకటేశ్వర్లు, యుగేందర్‌రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

చందంపేట మండలంలోని పలు గ్రామాల్లో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం యువజన నాయకులు కొండ్రపల్లి నగేష్, మాతంగి కాశయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బద్యనాయక్, మన్మధరెడ్డి, శివశంకర్ పాల్గొన్నారు.

డిండిలో ఎస్ఐ రాజు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అంబటి ఆంజనేయులు, మోడల్‌స్కూల్‌లో ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాడ్గులపల్లి మండలంలోని తోపుచర్ల గ్రామంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పుల్లెంల సైదులు, గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు జాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. దేవరకొండ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లోని కొండమల్లేపల్లి, నాగార్జునసాగర్, పెద్దఅడిశర్లపల్లి, గుడిపల్లి, హాలియా, దామరచర్ల, వేములపల్లి, మిర్యాలగూడ, నిడమనూరు, చింతపల్లి మండలాల్లో రాజ్యాంగ రచయిత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకలు సుభాని, షబ్బీర్, ఇక్బాల్, షరీఫ్, నజీర్ కుందూరు వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ రఘు, వెంపటి శ్రీనివాస్, జూపల్లి శ్రీనివాస్, పిల్లి ఆంజనేయులు, భానుచందర్‌రెడ్డి, ప్రసాద్ నాయక్, ముచ్చా అరుణ్‌కుమార్, వడ్డే సతీష్‌రెడ్డి, వర్ర వెంకట్‌రెడ్డి, ఏడుకొండలు, కొర్ర శంకర్, రమావత్ జవహర్‌నాయక్, ఉపాధ్యాయులు రాజు, భాను, రవి, భాస్కర్, అశోక్, లాలు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు స్కైలాబ్‌నాయక్ పాల్గొన్నారు.



దేవరకొండలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్, నాయకులు



దేవరకొండలో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



మిర్యాలగూడలో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

● అగ్నిమాపక అధికారి రామలింగం



దేవరకొండలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారి రామలింగం

దేవరకొండ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలని దేవరకొండ అగ్నిమాపక కేంద్ర అధికారి రామలింగం అన్నారు. దేవరకొండలో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా సోమవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించారు. అగ్ని ప్రమాదాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, వేసవిలో ఎలాంటి సంఘటనలు జరిగిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలన్నారు. ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది నాగుల్‌మీర, లింగయ్య, నరేష్, నవీన్‌కుమార్, పరబ్రహ్మం, రవి పాల్గొన్నారు.

● హాలియా మునిసిపాలిటీలో అగ్నిమాపక వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అగ్నివీరులకు నివాళులర్పించి మౌనం పాటించారు. అదే విధంగా అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం హాలియాలోని భారతీయ సార్వత్రిక విద్యాలయం విద్యార్థులకు అగ్నిమాపక పరికరాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కుందూరు వెంకట్‌రెడ్డి, పిల్లి చంద్రకళ ఆంజనేయులు, జూపల్లి శ్రీను, సోమశేఖర్, హాలియా కేంద్రాధికారి వెంకటేశ్వర్లు, కోటేశ్వర్‌రావు, ఫైర్ సిబ్బంది రమేష్, సాలయ్య, నాగరాజు, సాయికిరణ్, జలంధర్‌రెడ్డి, మోహన్, రాము, పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది స్వాతి, నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్న బియ్యం.. సహపంక్తి భోజనం

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఆహార భద్రత లబ్ధిదారులకు రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం అందించడం కొత్తేమీ కాదు. గత ప్రభుత్వాలు కొంతకాలం సన్న బియ్యం పంపిణీ చేశాయి. అయితే రేవంత్ ప్రభుత్వం పునఃప్రారంభించిన పథకం కొత్త ఒరవడి సృష్టిస్తోంది. ఉగాది సందర్భంగా ప్రారంభించిన ఈ పథకం ద్వారా బియ్యం పొందుతున్న కార్డుదారులు ఆనందం వ్యక్తం చేస్తుండగా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రతీ పథకానికి విస్తృత స్థాయి ప్రచారం చేయాలని సంకల్పించింది హస్తం పార్టీ. దీంతో పథకం పాతదైనా కొత్తదనం చూపిస్తున్నారు. పంపిణీ ప్రారంభ వేడుకను అట్టహాసంగా చేపట్టిన ప్రజాప్రతినిధులు ప్రస్తుతం వాడవాడలా సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. వార్డులోని దళిత, పేద కార్యకర్త ఇంట్లో అంతా కలిసి సన్న బియ్యం ఆహారాన్ని ఆరగిస్తుండటం గమనార్హం.

మంత్రి పిలుపుతో కదిలిన దళం

సన్నబియ్యం లబ్ధిదారుల ఇళ్లలో భోజనం చేయాలని సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పిలుపుతో కాంగ్రెస్ నేతలు కదులుతున్నారు. ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అనుచరగణంతో పాటు మాజీ కౌన్సిలర్లు, వార్డుల ఇన్‌చార్జీల ఆధ్వర్యంలో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేస్తూ వాడవాడలా పర్యటిస్తున్నారు.

మదనాపురంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

చింతపల్లి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మదనాపురం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రధానంగా భక్తులు గ్రామపురవీధుల గుండా ఉత్సవమూర్తులను వైభవంగా ఊరేగించారు. కార్యక్రమంలో అర్చకులు మురుకుంట్ల సీతయ్యశర్మ, రవిశర్మ, చైర్మన్ దేరంగుల రాజు, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జానాను అప్రతిష్ఠపాలు చేయడం తగదు

● కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు బాధాకరం : నారాయణ

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా పార్టీకి, ప్రజలకు సేవలందిస్తున్న సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డిని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అప్రతిష్ఠపాలు చేయడం తగదని కాంగ్రెస్ పార్టీ మిర్యాలగూడ పట్టణ ప్రధాన కార్యదర్శి నీరుకంటి నారాయణ అన్నారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి పదవి రాలేదన్న అసంతృప్తితో రాజకీయయోధుడిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. జానా గత జీవితాన్ని లోతుగా పరిశీలిస్తే ధర్మారాజని స్పష్టమవుతుందన్నారు. ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీని వీడిన రాజగోపాల్‌రెడ్డి నాడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఓడించారని గుర్తుచేశారు. పార్టీలోకి పునఃప్రవేశం చేసిన రాజగోపాల్‌రెడ్డి తనకు మంత్రి పదవి రాకుండా జానాతో పాటు జిల్లాకు చెందిన కీలక నేతలు అడ్డుపడుతున్నారనడం ఆక్షేపణీయమన్నారు. సీనియర్ నేత అయిన జానా సూచనలు, సలహాలు అధిష్ఠానం తీసుకుంటుందని. దానిని తప్పుపట్టడం అవివేకమన్నారు. సమావేశంలో నాయకులు కుప్పాల సుబ్బారావు, పసుపులేటి శివ, ఎం. వెంకటేశ్వర్లు, నాగేంద్రబాబు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లిలో ట్రాఫిక్ కష్టాలు

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): నాలుగు రోడ్ల కూడలి కావడంతో జడ్చర్ల - కోదాడ జాతీయ రహదారి 167 మరియు హైదరాబాద్-నాగార్జునసాగర్ రాష్ట్ర ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. కొండమల్లేపల్లి మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు ఇతర చిరు దుకాణాల వల్ల తరచూ ట్రాఫిక్ స్తంభిస్తుందని పట్టణ ప్రజలు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ రిక్షాలు, ఆటోలు బస్సులు వాహనాలకు సరైన పార్కింగ్ లేక రోడ్డుకు అడ్డంగా నిలుపుతుండటంతో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతుందని అలాగే బస్సు డ్రైవర్లు తమకు ఇష్టం వచ్చినట్లు రోడ్లపైనే నిలుపుతుండడంతో ట్రాఫిక్ జామ్ అవుతుందని పలువురు పేర్కొంటున్నారు. దేవరకొండ రోడ్డులో గల యూనియన్ బ్యాంక్ ముందు పార్కింగ్ లేకపోవడంతో బ్యాంకుకు వచ్చే ప్రజలు తమ వాహనాలను రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. అధికారులు పర్యవేక్షణ లోపంతో వాహనదారులు ఇష్టం వచ్చినట్లుగా నడుపుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు వేడుకుంటున్నారు.